శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## ప్రభుత్వం నిర్దేశించిన పనుల్లో పురోగతిని సాధించాలి



**మర్రిపాడు,(ఆత్మకూరు)సెప్టెంబర్14,ప్రభాతవార్త:** ప్రభుత్వం నిర్దేశించిన పనుల్లో పురోగతిని సాధించే దిశగా లక్ష్యాలను పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూరులోని మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగిన ఆత్మకూరు డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జెసి ఆర్.కూర్మనాథ్ డివిజన్, మండల అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమై పేదలందరికీ ఇళ్ళ నిర్మాణల పురోగతి, జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్షా పథకంలో భాగంగా ఒటిఎస్ అమలు, రీసర్వే, సచివాలయంలో అమలవుతున్న సర్వీసెస్ పురోగతి, జలజీవన్ మిషన్, స్వచ్ఛ సంకల్పం, ఉపాదిహామీ పథకం కింద చేపడుతున్న పనుల పురోగతి, జలకళ, శానిటేషన్ , కాంప్లెక్స్ నిర్మాణాల పురోగతి, మధ్యాహ్న భోజన పథకం అమలు , మనబడి , నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాలల్లో జరుగుతున్న పనులపురోగతి, ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం, ఓటర్ల జాబితాకు సంబంధించి క్లైమ్స్, అబ్జక్షన్లు, వాటర్ టాక్స్ కలెక్షన్స్, భూసేకరణ ప్రక్రియ తదితర అంశాలపై శాఖల వారీగా సమీక్షించారు. పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు ఆర్‌డిఓ కరుణకుమారి, జడ్పీ సిఇఒ చిరంజీవి, డిపిఓ ధనలక్ష్మి, డ్వామా డిఆర్‌డిఎ పిడిలు వెంకట్రావ్, సాంబశివారెడ్డి, హైసింగ్ పిడి వరప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ఇ శ్రీరంగవరప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఎడి హనుమాన్ ప్రసాద్, ఆత్మకూరు మున్సిపల్ కమీషనర్ రమేష్‌బాబు, ఆత్మకూరు డివిజన్ పరిధిలోని తహసిల్దార్లు, ఎంపిడిఒలు, వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## విద్యా దీవెన, వసతి దీవెన పథకానికి అర్హులైన విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**నెల్లూరు టౌన్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** 2022 - 2023 విద్యా సంవత్సరానికి గాను జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన పథకానికి అర్హులైన విద్యార్థినీ విద్యార్థులు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారితాధికారి ఎం.రమాదేవి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని కళాశాలల ప్రిన్సిపాల్స్ అందరూ తమ కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు దరఖాస్తులు పూర్తి చేసి వారి తల్లిదండ్రుల సంతకము తీసుకుని ధ్రువీకరించి అర్హత కలిగిన రెన్యువల్ విద్యార్థుల దరఖాస్తులన్నింటినీ జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో కళాశాల లాగిన్‌లో నమోదు చేసి అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు విద్యార్థి గత సంవత్సరం మార్కులు, హాల్‌టిక్కెట్ నెంబరు కచ్చితంగా నమోదు చేయాలన్నారు. ఈ పథకానికి గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల పిల్లలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ఈ నెల 30వ తేదీ లోగా వినియోగించుకోవాలని సూచించారు.

## రైతు ఉత్పత్తి కేంద్రాలకు అండగా నాబార్డు




**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త** జిల్లాలోని రైతు ఉత్పత్తి కేంద్రాలకు (ఎఫ్‌పీఓ) అండగా వుంటుందని జాతీయ వ్యవసాయ అభివృద్ధి బ్యాంక్ (నాబార్డు) డిడిఎం రవిసింగ్ పేర్కొన్నారు. బుధవారం నెల్లూరులోని జిల్లా కేంద్రసహకారబ్యాంక్ కార్యాలయంలో రైతు ఉత్పత్తికేంద్రాల నిర్వాహకులు, ఎన్‌జిఓలు, రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకై ఏర్పాటుచేసిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నాబార్డు సహకారంతో ఏర్పాటైన రైతు ఉత్పత్తి కేంద్రాలు మంచి స్థితికి చేరుకున్నాయని, వ్యాపార లావాదేవీలు జరుపుతున్నాయన్నారు. ప్రభుత్వం వివిధశాఖల ద్వారా అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై ఎఫ్‌పీఓ సీఈఓలకు అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్న ఆయన శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని రైతుల చెంతకు వాటిని చేరాల్సి వుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌పీఓలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్న ఆయన కొత్తగా మరిన్ని ఎఫ్‌పీఓల ఏర్పాటుకు అనుమతులిస్తోందన్నారు. జిల్లాలో వీలైనంతమంది రైతులను రైతు ఉత్పత్తి సంఘాలలో సభ్యులుగా చేర్చి వారి ఆదాయం పెంచేలా సీఈఓలు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా సహకారశాఖాధికారి తిరుపాల్‌రెడ్డి, వ్యవసాయశాఖ డిప్యూటీ డైరక్టర్ శివన్నారాయణ, అసిస్టెంట్ డైరక్టర్ గుమ్మడి అనిత, ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డిలు తమ తమశాఖల ద్వారా అమలుచేస్తున్న పథకాలను రైతు ఉత్పత్తికేంద్రాల నిర్వాహకులకు తెలియజేశారు. రైతులు సంఘంగా ఏర్పడితే పలు ప్రయోజనాలు వుంటాయన్న వారు వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చన్నారు. ఉద్యానశాఖ ద్వారా రైతులకు సబ్సిడీతో కూడిన పలు పథకాలు అందజేస్తున్నట్టు వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంక్ రీజనల్ మేనేజర్ శైలేంద్రనాథ్, ఎన్‌డీసీసీబీ జనరల్ మేనేజర్ సరిత, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రదీప్‌లు బ్యాంక్‌లు రైతులకు అందజేసఉన్న రుణాలపై వివరించారు. కాగా ఈ కార్యక్రమంలో రైతు ఉత్పత్తి కేంద్రాల సీఈఓలతోపాటు స్వచ్ఛంధసంస్థల ప్రతినిధులయిన వడ్డి రవీంద్రచౌదరి, గుణపాటి ప్రసాద్‌రెడ్డి, భూపేష్‌రెడ్డి, రవికుమార్‌రాజా, చంద్రశేఖర్, రమణయ్య, గంగిరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక విద్యే ఆయువుపట్టు



**చేజర్ల,సెప్టెంబర్14,ప్రభాతవార్త:** విద్యార్థి కి ప్రాథమిక స్థాయిలోనే చదవడం, వ్రాయడం , గణితంలో చతుర్విద ప్రక్రియలు చేయడం , ఆంగ్లంలో చదవడం, వ్రాయడం నేర్పాలని విద్యార్థి అనర్గళంగా చదివేలా ప్రతి ఉపాధ్యాయుడు చదవాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ పేర్కొన్నారు. బుధవారం ఆయన చేజర్ల మండలంలోని బోడిపాడు, గొల్లపల్లి హెచ్‌డబ్ల్యు ప్రాథమిక పాఠశాలలను , తూర్పుపల్లి , చేజర్ల ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. నాడు-నేడు పథకంలో చేపట్టిన పనుల పరిశీలన , మొదటివిడతలో చేపట్టిన పనులకు సంబంధించి న అన్ని కాంపోనెంట్‌లు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అన్న విషయమై పరిశీలించారు. జగనన్న విద్యాకానుకకు సంబంధించిన కిట్లు విద్యార్థులందరికీ అందాయాలేదా అన్న విషయాన్ని, మధ్యాహ్న భోజనం మెనూప్రకారం అందుతున్నాయా లేదా అన్న విషయాలను పరిశీలించడంతోపాటు తూర్పుపల్లి ఉన్నతపాఠశాలలోని విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలోని వసతులు, సమస్యలపై ఉపాధ్యాయులతో చర్చించారు. అనంతరం చేజర్ల ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయులతో సమీక్షించారు. నూతన ఒరవడులకు అనుగుణంగా ఉపాధ్యాయులు పనిచేయాలని , ప్రతి విద్యార్థి ఉత్తీర్ణులయ్యేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన కోరారు. పాఠ్యాంశాల వారీగా ఉపాధ్యాయులతో సమీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మనకు చిన్నతనంలో చదువుచెప్పిన ఉపాధ్యాయులు స క్రమంగా చెప్పినందువలనే మనం ఉపాధ్యాయ వృత్తిని చేపట్టామని , మనం కూడా మన తర్వాతి తరానికి బీజాలు వేయాలన్నారు. కరోనా తదితర కారణాల వలన ఉన్నతపాఠశాలలకు వచ్చినప్పటికీ విద్యార్థులు గుణించుకుంటూ చదవడం సరైన పద్ధతి కాదన్నారు. విద్యార్థుల్లో రోజురోజుకు పెరగాల్సి న విద్యాప్రమాణాలు తరిగిపోతున్నాయన్నారు. అందరూ సక్రమంగా పనిచేస్తే ప్రవేటు పాఠశాలలు ఏర్పడే అవకాశమే లేదన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు మన పాఠశాలలోని విద్యార్థులందరూ చదవడం, వ్రాయడం చేయగలరని ఖచ్చితంగా తెలియజేసిన నాడే ఆపాఠశాల స్థాయి పెరుగుతుందని, ప్రజల్లో ఉపాధ్యాయుడిపట్ల గౌరవం పెరుగుతుందన్నారు. ఉపాధ్యాయుడికి సమాజంలో ఎంతో గౌరవం, విలువ ఉందని సమాజాన్ని నిర్దేశించగల సత్తా గురువుకు మాత్రమే ఉందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఉత్తమ గురువుగా పేరుతెచ్చుకునేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఉపాధ్యాయుల సమస్యల గురించి తెలుసుకున్నారు. యాప్‌లను సక్రమంగా ఉపయోగించాలని , సకాలంలో హాజరు వివరాలను పంపాలన్నారు. మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించడంతోపాటు నాణ్యతతో కూడిన ఆహారపదార్థాలను విద్యార్థులకు అందేలా చూడాల్సి న బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి పంచాగ్నుల కళాధర్, ఉన్నతపాఠశాల ల ప్రధానోపాధ్యాయులు గుడుగుంట శేషగిరిరావ్, దుర్భా కృష్ణమూర్తి, బొల్లా శైలజ, అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు , సిఆర్‌పిలు పాల్గొన్నారు.

## 24 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

**వెంకటాచలం సెప్టెంబర్ 14 ప్రభాతవార్త** ప్రభుత్వ రేషన్ బియ్యం పంపిణిలో ప్రభుత్వం ఎన్ని కఠిన చర్యలు చేపట్టినప్పటికి బియ్యం నల్లబజారు తరలిపోతూనేచ ఉంది,ఈ విషయం వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద బుదవారం విజిలెన్స్ దాడులలో రుజువయింది.బుదవారం వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద విజిలెన్స్ అదికారులు సాదారణ తనీఖీ నిర్వహిస్తుండగా రేషన్ బియ్యంతో వెళ్లుతున్న రెండు లారీలు పట్టుబడ్డాయి.ఒక్కో లారీలో 12 టన్నుటు బియ్యం రవాణా చేస్తున్నట్లు అదికారులు నిర్దారించారు.ఈ బియ్యం రాజమండ్రి నుంచి చెన్నెకు తరలిస్తున్నట్లు గుర్తించారు.విజిలెన్స్ అదికారులు పట్టుబడిన లారీ డైవర్‌ను అదుపులోకి తీసుకోని విచారించి,వెంకటాచలం పోలీసు స్టేషన్‌లో అప్పగించారు.

# పక్కాగా గ్రామీణ పేదరిక నిర్మూలనా ప్రణాళిక తయారీ



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త** గ్రామీణ పేదరిక నిర్మూలనా ప్రణాళిక తయారీ మొక్కుబడిగా కాకుండా కుటుంబపరంగా, సామాజికపరంగా సమగ్రంగా పరిశీలించి చేయాలని జిల్లా కలెక్టర్ కేవీఎన్‌చక్రధర్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం క్యాంప్ కార్యాలయంలో 2022-23 గ్రామీణ పేదరిక నిర్మూలనా సమన్వయ సమావవేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరక్టర్ కేవీసాంబశివారెడ్డి ప్రణాళిక తయారీ ముఖ్య ఉద్దేశాలను సభ్యులకు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలలో వున్న కుటుంబాలతోపాటు ఆయా సంఘాలలో లేని పేద కుటుంబాలను కూడా గుర్తించి వారి అవసరాల మేరకు గ్రామీణ పేదరిక నిర్మూలనా ప్రణాళిక రూపకల్పన చేయాలన్నారు. గ్రామస్థాయిలో ప్రజల భాగస్వామ్యం పెంపొందించేలా పారదర్శకతతో పనిచేయాలన్న ఆయన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి కమ్యూనిటీ మెంబరన్లకు అవగాహన కల్పించాలన్నారు. కమ్యూనిటీ స్థాయి అవసరాలు సేకరించిన తర్వాతే స్వయం సహాయక సంఘాల స్థాయిలో, విఓ స్థాయిలో క్రోడీకరించి వాటిని గ్రామ పంచాయితీ స్థాయిలో ఏకీకృతం చేయాలన్నారు. అలాగే మండలస్థాయిలో, గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి గ్రామీణ పేదరిక నిర్మూలన ప్రణాళిక సమగ్ర వివరాలతో తయారుచేయాలన్నారు. కాగా ఈ సమావేశంలో డిఆర్వో వెంకటనారాయణమ్మ, డిఆర్‌డిఏ పీడీ కేవీసాంబశివారెడ్డి, డిపిఓ ఎం.ధనలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ ఉమామహేశ్వరి, ఐటిడిఏ పీడీఓ మందరాణి, డిఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య, పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ మహేశ్వరుడు, ఉద్యానశాఖ ఏడి సుబ్బారెడ్డి, జిల్లాపరిషత్ ఇన్‌చార్జ్ సీఈఓ చిరంజీవి, డ్వామా ఏపీడీ నిర్మలాదేవిలు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమం అందాలి



**నెల్లూరురూరల్, సెప్టెంబరు14 ప్రభాతవార్త** జిల్లాలో అర్హులందరికీ ప్రజా సంక్షేమ పథకాలు అందాలని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నెల్లూరురూరల్ మండలం సౌత్‌మోపూరు గ్రామ చివాలయం, వాణిశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆమె వైకాపా రాష్ట్ర కార్యదర్శి, డిసిసిబి మాజీచైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డితో కలసి సందర్శించారు. స్థానిక బిసి హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సి న బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. శిధిలావస్థలో ఉన్న బిసి హాస్టల్‌ను పునరుద్ధరిస్తామని హామి ఇచ్చారు. విద్యార్థుల చదువులు సజావుగా సాగాలని, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు జిల్లా ప్రజాపరిషత్ పక్షాన చేపడతామని ప్రకటించారు. వైకాపా కార్యదర్శి ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వానికి రెండు కళ్ళు వంటివన్నారు. బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని వివరించారు.

**మొగళ్ళపాళెంలో:** మొగళ్ళపాళెం గ్రామంలో నిర్మిస్తోన్న రామాలయాన్ని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఈసందర్భంగా సందర్శించారు. స్థానికులతో అభివృద్ధి, సంక్షేమాన్ని చర్చించారు. రామాలయ ప్రహరీ, సామాజిక భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తామని హామి ఇచ్చారు. ఈకార్యక్రమంలో స్థానిక వైయస్సార్సీపి నాయకులు చేవిరెడ్డి ప్రభాకరరెడ్డి, సీనియర్ నాయకులు పముజుల దదశరధరామయ్య తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## పన్ను వసూళ్లపై దృష్టి సారించండి



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని కమర్షియల్, ఆస్తి పన్నులతో పాటు, ఇంటింటి చెత్త సేకరణకు యూజర్ చార్జీల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ డి.హరిత సచివాలయం కార్యదర్శులకు ఆదేశించారు. స్థానిక 36/2 మూలాపేట సచివాలయాన్ని కమిషనర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో సంక్షేమ పథకాల అమలు రికార్డులను, సిబ్బంది హాజరును పరిశీలించారు. సచివాలయం పరిధిలోని గృహాలు, కమర్షియల్ భవనాలన్నింటికీ చెత్త సేకరణ బిన్స్ పంపిణీపై విచారించారు. కార్యదర్శులంతా ప్రభుత్వం సూచించిన డ్రెస్‌కోడ్ యూనిఫామ్ ప్రతి రోజూ తప్పక ధరించాలని, క్రమశిక్షణ తప్పిన వారిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

## మహిళా డెలివరీ స్టేషన్‌ను ప్రారంభించిన అమెజాన్

**నెల్లూరు,సెప్టెంబరు14 ప్రభాతవార్త-విద్య** రాష్ట్రంలో డెలివరీ సర్వీస్ పార్టనర్‌తో కలిసి దేశంలోనే అతిపెద్ద మహిళా డెలివరీ స్టేషన్‌ను బుధవారం అమెజాన్ కంపెనీ ప్రారంభించిదని, సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతు మహిళలను అన్నీ రంగాలల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో తమ సంస్థ రాష్ట్రంలోని రాజమండ్రిలో నూతన మహిళా డెలివరీ స్టేషన్‌ను ప్రారంభిచంట జరిగిందన్నారు. ఇది దేశంలోనే 7వ స్టోర్ అని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఇటువంటి మహిళా డెలివరీ స్టోర్స్ కేవలం తమిళనాడు, గుజరాత్, కేరళ, మిజోరాంలలో మాత్రమే ఉన్నాయని ప్రస్తుతం మనరాష్ట్రంలో ప్రారంభించటం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో ఈ స్టోర్స్ కి వచ్చే ఆదరణను బట్టి రాష్ట్రంలోని అన్నీ నగరాలకు విస్తరించనున్నామని పేర్కొన్నారు. నూతన ఫెస్టివల్ ఆఫర్‌లతో సిద్దంగా ఉన్న అమెజాన్ నూతన డెలివరీలను మహిళల టీం చేత చేయించనుందన్నారు. డెలివరీలో ఎదురైన సమస్యలను అదిగమించేందుకు సంస్థ టోల్ ఫ్రీ నెంబర్‌ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో ఇటువంటి డెలివరీ పాయింట్స్‌ను దేశంలోని అన్నీ నగరాలతోపాటూ చిన్న ప్రాంతాల్లో సైతం ప్రారంభించేందుకు ప్రనాళికలను సిద్దంచేశామన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ఘనంగా హిందీభాషా దినోత్సవం



**చేజర్ల,సెప్టెంబర్14,ప్రభాతవార్త:** అన్ని ఉన్నతపాఠశాలల్లో , బాలయోగి గురుకుల పాఠశాలలో హిందీ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదూరుపల్లి గురుకులంలో ప్రిన్స్‌పాల్ శైలజాకుమారి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 14న హిందీభాషా దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. హిందీభాష యొక్క ఉపయోగాలు, ప్రాధాన్యతను గురించి హిందీ ఉపాధ్యాయిని నాగలలిత వివరించారు. ఆదూరుపల్లి ఉన్నతపాఠశాలలో హిందీ ఉపాధ్యాయిని టిఎన్‌కామాక్షి ఆధ్వర్యంలోను , చేజర్లలో విమల ఆధ్వర్యంలో ను హిందీభాషాదినోత్సవాన్ని నిర్వహించారు. తూర్పుకంభంపాడు, తూర్పుపల్లి, నాగులవెలటూరు, మాముడూరు , చేజర్ల పాఠశాలల్లో హిందీ పండింట్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. బాలయోగి గురుకులంలో హిందీ అనే అక్షర రూపంలో విద్యార్థులను కూర్చోబెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## గాంధీజయంతి నుంచి జిల్లాలో అక్షరచైతన్యం-2



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త** గాంధీజయంతి అయిన అక్టోబర్ 2వ తేదీ నుండి జిల్లాలో అక్షరచైతన్యం-2 కార్యక్రమాన్ని అమలుచేయనున్నట్టు జిల్లా కలెక్టర్ కేవీఎన్‌చక్రధర్‌బాబు పేర్కొన్నారు. అక్షరచైతన్యం-2 కి సంబంధించిన చదువుకుందాం 1, 2 పుస్తకాలను ఆయన బుధవారం క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల పునర్వ్యవస్థీకరణ ముందు 46 మండలాల్లో 15 సంవత్సరాలకు పైబడ్డ 1,49,597 మంది నిరక్ష్యరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు అక్షరచైతన్యం పేరుతో ప్రత్యేక అక్షరాస్యతా కార్యక్రమం చేపట్టామన్నారు. 16.08.21 మొదలైన ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి నుండి గ్రామస్థాయి వరకు ప్రభుత్వ యంత్రాంగం, వయోజన విద్యాశాఖ, వాలంటీర్లు భాగస్వామ్యులయ్యారని, అక్షరకేంద్రాల ద్వారా నిరక్షరాసులకు తరగతులు నిర్వహించడం జరిగిందన్నారు. అక్షరచైతన్యం సత్ఫలితాలిచ్చిందన్న చక్రధర్‌బాబు వీరిలో అక్షరాస్యతా అర్హత పరీక్షలలో 1,16,566 మంది ఉత్తీర్ణత చెందడం జరిగిందన్నారు. దీనితో జిల్లాలో అక్షరాస్యతా శాతం 68 నుండి 84కి పెరిగిందన్న కలెక్టర్ తాజాగా సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకై జిల్లాలో ప్రస్తుత 37 మండలాల్లో గాంధీజయంతి నుండి అక్షరచైతన్యం-2 కార్యక్రమాన్ని అమలుచేయనున్నామన్నారు. గ్రామస్థాయి నుండి జిల్లాస్థాయి వరకు జిల్లా యంత్రాంగం అంతా ఇందులో భాగస్వామ్యం అవుతుందన్న కలెక్టర్ ఇందులో భాగంగా గుర్తించబడ్డ 15 సంవత్సరాలకుపై బడ్డ వారికి చదువుకుందాం 1, 2 పుస్తకాలలోని విషయాలను అక్షరకేంద్రాల ద్వారా భోధించడం జరుగుతుందన్నారు. బోధనా తరగతుల నిర్వహణ అనంతరం వీరికి అక్షరాస్యతా అర్హత పరీక్షలు నిర్వహిస్తామన్న ఆయన ఉత్తీర్ణులైన వారికి అక్షరాస్యతా ధృవపత్రాలు అందజేస్తామన్నారు. డిఆర్వో వెంకటనారాయణమ్మ, జిల్లాపరిషత్ ఇన్‌ఛార్జ్ సీఈఓ బి.చిరంజీవి, డిఆర్‌డిఏ పీడీ కేవీసాంబశివారెడ్డి, డిఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య, డిపిఓ ఎం.ధనలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## దాతల సహకారం అభినందనీయం



**చేజర్ల, సెప్టెంబర్14,ప్రభాతవార్త:** పాఠశాలలోని అవసరాలను గుర్తించి పాఠశాలకు అవసరమైన సౌండ్‌సిస్టంను బహుమతిగా అందజేసిన ధరణి సేవా సమితి యాజమాన్యానికి ప్రత్యేక అభినందనలు తెలియజేయాల్సి న అవసరం ఎంతైనా ఉందని ఎంపిపి బాలిరెడ్డి రమాదేవి పేర్కొన్నారు. బుధవారం మాముడూరు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు 50వేల రూపాయల సౌండ్‌సిస్టం, స్పీకర్లను విరాళంగా అందజేసిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ వై.వి.రామిరెడ్డి , ధరణిసేవా సమితి మేనేజింగ్ ట్రస్టీ వై.మంజులను జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఎంపిపి రమాదేవి , వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు శాలువాలతో సన్మానించారు. మంజుల తండ్రి లంకా శంకర్‌రెడ్డి జ్ఞాపకార్థం 50వేలరూపాయల విలువచేసే సౌండ్‌సిస్టంను అందజేయడం హర్షణీయమన్నారు. ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

# దేశ సంపదలను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న కేంద్రం



**నెల్లూరు,సెప్టెంబరు14 ప్రభాతవార్త-విద్య** మతోన్మాద దేశభక్తి ముసుగులో కేంద్రప్రభుత్వం దేశంలోని విలువైన సంపదను కారుచౌకగా కార్పోరేట్ శక్తులకు కట్టబెతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని స్థానిక వెంకటేశ్వరపురంలో నిర్వహించిన దేశ రక్షణబేరీలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. లౌకిక రాజ్యాంగ స్పూర్తిని ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. అధిక ధరలను అరికట్టడంలో కేంద్ర,రా ష్ట్ర ప్రభుత్వాలు పూరి_గా విఫలం చెందాయన్నారు. కరోనాతో అల్లాడిపోయిన ప్రజలకు ఉపశమనం కల్గించాల్సి న ప్రభుత్వం నూతన పన్నులను విధిస్తూ వారిని నానా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. పోరాడి సాధించిన కార్మిక హకు zలను కార్పోరేట్ శక్తుల ముందు తాకట్టు పెట్టి కార్మికుల హకు zలను కాలరాస్తుందన్నారు. ప్రత్యేకహోదా ఇస్తామని నమ్మించి మెసగించిందని దుయ్యబట్టారు కోట్ల రూపాయల ఆదాయాలను ఇచ్చే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించటం దారుణమన్నారు. ఉద్యోగాలు కల్పిచాల్సి న ప్రభుత్వం ఉన్న ఉద్యోగాలు ప్రయివేటీకరిస్తూ నిరుద్యోగులను మెసగించిందన్నారు. పెట్రోల్,డీజిల్,ధరలు నానాటికి పెరుగుతన్నాయన్నారు. గ్యాస్ పై సబ్సిడీ ఎత్తివేసిన ఘనత మెదీకే దక్కుతుందన్నారు. ప్రజలను నిలువునా మెసగిస్తున్న బిజెపి ఆగడాలను ఎట్టిపరిస్థితుల్లో సాగనివ్వబోమన్నారు. 53వ డివిజన్ వెంకటేశ్వరపురంలో ప్రారంభమైన జాతా ఇస్లాంపేట, అంబేద్కర్ నగర్, జనార్ధన్‌రెడ్డి కాలనీ, వాటర్‌ట్యాంక్ ఏరియా, విజయాడెయిరీ సెంటర్, మెయిన్ రోడ్ తదితర ప్రాంతాల్లో సాగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నగర కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు షేక్.మస్తాన్‌బీ, వెంకటేశ్వర్లు,జాఫర్, శ్రీనివాసులు, నరసింహ, వేణు, చాన్ బాషా, అమాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హిందీ దీవస్ వేడుకలు

**ఉలవపాడు, సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉలవపాడులోని కనిష్క హిందీ విద్యాలయం వారి ఆధ ర్వర్యంలో హిందీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కనిష్క హిందీ విద్యాలయం నిర్వహకులు హిందీ ప్రచారక్ బీవీఆర్ నరేష్ మాట్లాడుతూ హిందీ దివస్ ఏటా 14 సెప్టెంబరు న దేశం ఘనంగా జరుపుకుంటుందని, దేవనగిరి లిపి నుంచి తీసుకుని భారత అధికారిక భాషగా హిందీని గుర్తించడం జరిగింది. భారత అధికారిక భాషగా హిందీని గుర్తించడంలో ఎనలేని కృషి చేసిన బియోహార్ రాజేంద్ర సింహ పుట్టిన రోజు కూడా సెపె ్టంబరు 14న కావడం విశేషం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 343 ప్రకారం దేశంలోని గుర్తించబడ్డ 22 భాషల్లో హిందీ అధికారిక భాషగా గుర్ి్తంచడం జరిగింది. హిందీ భాషను ఈ రోజు గౌరవించడం జరుగుతుందని అని, దేశవ్యాప్తంగా పలు సంస్కృతులకు చెందిన పండగలను కూడా ఈ రోజు పాటిస్తారు. హిందీ సాహిత్యాన్ని ఒక వేడుకలా నిర్వహిస్తారని, సెప్టెంబరు 14న తేదీన రాజ్‌భాష కీర్తి పురస్కార్, రాజ్ భాష, గౌరవ్ పురస్కార అవార్డులను హిందీ భాష కోసం విశేష కృషిని చేసిన వ్యక్తులకు లేదా సంస్థలకు ప్రధానం చేస్తారని ఆయన తెలిపారు. అదేవిధంగా ఉలవపాడు మండలంలో గల 15 సంవత్సరాలుగా దక్షిణ భారత హిందీ ప్రచార సభ వారు నిర్వహించే ప్రాథమిక నుండి ప్రవీణ వరకు తరగతులు కూడా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## 960గుట్కాప్యాకెట్‌లు స్వాధీనం

**మర్రిపాడు(ఆత్మకూరు)సెప్టెంబర్14,ప్రభాతవార్త:** మండలంలోని గండ్లవేడు లో సెబ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచిన 7500రూపాయల విలువచేసే 960ప్యాకెట్‌ల నిషేధిత గుట్కాలను స్వాధీనం చేసుకొని వారిని అరెస్ట్ చేశారు.

## ఆక్స్‌ఫర్డ్‌లో హిందీ బాషా దినోత్సవ వేడుకలు



**కందుకూరు,సెప్టెంబర్14,ప్రభాతవార్త:** పామూరు రోడ్డులోని ఆక్స్ ఫర్డ్ స్కూల్‌లో బుధవారం హిందీ బాషా దినోత్సవ వేడుకలను నిర్వహించారు.విద్యార్థినీ విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరైయ్యారు.ఈ సందర్భంగా పలు కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఛైర్మన్ ఉన్నం భాస్కర్ హాజరై హిందీ బాష ఔనత్యాన్ని గురించి వివరించారు.1949 సెప్టెంబర్ 14న హిందీని జాతీయ బాషగా గుర్తించినట్లు ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బాలభాస్కర్, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, బి.నరేంద్ర,రామారావు,మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యానవన ప్రవేశ ధరఖాస్తులకు ఈ నెల 30వరకు గడువు

**కందుకూరు,సెప్టెంబర్14,ప్రభాతవార్త:** ఉద్యానవన విశ్వవిద్యాలయంలో అర్హత పొందిన వారు చేరేందుకు ఈ నెల 30వరకు గడువు ఉందని వైయస్సార్ ఉద్యానవన శాఖ ఒక ప్రకటనలో వెల్లడించారు.22-23విద్యా సంవత్సరానికి సంబంధించి డిఎస్సీ కోర్సుల్లో విద్యార్థులు ధరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు.అలాగే ఎంసెట్‌లో అర్హత పొందిన వారు కూడా విశ్వవిద్యాలయంలో చేరేందుకు అర్హులని వెల్లడించారు.

## పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం

**కందుకూరు,సెప్టెంబర్14,ప్రభాతవార్త:** కందుకూరు పట్టణంలోని టిఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో అనాద పేద విదా ్యర్థుల సహాయార్థం 10వేల రూపాయల ధన సహాయం అందజేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రవికుమార్ తెలిపారు.ఇదే కళాశాలలో విద్య అభ్యసించి పాండిచర్రీలో వ్యాపారవేత్తగా స్థిరపడిన పొత్తూరి వెంకటేశ్వర్లు అనాద పేదవిద్యార్థులకు 10వేల రూపాయల సహాయం చేసినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

## ముస్లింలకు బిసి సర్టిఫికెట్లు అందించాలని విజ్ఞప్తి

**కందుకూరు,సెప్టెంబర్14,ప్రభాతవార్త:** ప్రభుత్వం అమలు చేస్తున్న ముస్లిం రిజర్వేషన్లకు సంబంధించి బిసి సర్టిఫికెట్లు అందించాలని కోరుతూ అధ్యక్షులు కరిముల్లా ఆధ్వర్యంలో మైనారిటీ కమీషన్ డాక్టర్ ఇగ్బాల్‌ను కలిసి విన్నవించారు.విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేయడంలో జాప్యం జరుగుతున్నట్లు వారు కమీషనర్ దృష్టికి తీసుకుని వెళ్లారు.అలాగే సమస్యలను పరిష్కరించాలని కూడా విన్నవించడం జరిగింది.

## జడ్‌పి పాఠశాలలో హిందీభాషా దినోత్సవం

**ఉదయగిరి సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:** ఉదయగిరి మండలంలోని గండంవారిపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయులు శీనయ్య ఆధ్వర్యంలో హిందీభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా హిందీఉపాధ్యాయులు సురేష్ కుమార్ మాట్లాడుతు హిందీదివస్ ప్రతి ఏటా దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 14న జరుపుకుంటారని అన్నారు. దేవనగిరి లిపి నుండి తీసుకొని భారత అధికార భాషగా హిందీని గుర్తించడం జరిగిందని అన్నారు.హిందీభాషాను నేర్చుకోవడం ద్వారా భారతదేశంలోనే కాకుండా ప్రపంచంలో చాలా చోట్ల వరకు మన ఉనికిని చాటుకోవచ్చునని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శీనయ్యతోపాటు ఇతర ఉపాధ్యాయులు,విద్యార్దులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలి

**ఉదయగిరి సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** ఏపి రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య మంగళవారం నియోజకవర్గ పరిధిలోని కుర్రపల్లి రహదారిపై కల్తి విత్తనాలు మందులు వాడి ఉదయగిరిలో 190 ఏకరాలు,పొద్దుతిరుగుడు పంటలు వేసిన రైతులు నష్టపోయారని వారిని వారి కుటుంబాల్ని ఆదుకోవాలని మండల రైతులతో కలిసి ఆయన ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామాలలో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కుంటు అధిక వడ్డీలకు నగదు తెచ్చి ఆశాగా వేసుకున్న పంటలు చేతికి రాకపోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు.పంట విత్తనాలు, ఎరువులు,నాణ్యతను తెలుపుతు రైతులకు అమ్మిన దుకాణ యజమానులు పెద్ద సంఖ్యలో రైతుల్ని మోసం చేయడంతో ఎకరాకి క్వింటాకూడా చేతికిరాని దుస్థితి నెలకొనిందని అన్నారు. ఎకరానికి 30 వేలు చొప్పున పెట్టుబడులు పెట్టి ఏకరానికి 7 నుండి 8 కి ్వంటాళ్ల దిగుబడి రావాల్సిన పంట ఇప్పుడు ఎకరానికి అరకి ్వంటా లేదా ఒక క్వింటా దిగుబడి చేతికి వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే నష్టపోయిన రైతుల్ని వ్యవసాయాధికారులు ఆదుకోని నకిలి విత్తనాలు పంపిణి చేసిన యజమానుల దగ్గర నుండి పంట నష్టపరిహారంను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.అలాగే పంటను ప్రభుత్వం ఈక్రాప్ చేసిన రైతులను వెంటనే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని అన్నారు.ఈకార్యక్రమంలో మండల చుట్టుపక్కల గ్రామాల రైతులు,రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.

## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణఅభియాన్ మాసోత్సవాలు



**వింజమూరు,సెప్టెంబర్14,ప్రభాతవార్త:** వింజమూరు మండల పరిధిలోని నేరేడుపల్లి, గుండెమడకల గ్రామాల్లో స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణఅభియాన్ మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం నేరేడుపల్లి గ్రామంలో సూపర్‌వైజర్ శ్రీదేవి , అంగన్‌వాడీ కార్యకర్త లీలావతి ఆధ్వర్యంలో గర్భవతులకు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ పౌష్టికాహారం ఆవశ్యకతను వివరిం చారు. తల్లి ఆరోగ్యపరిస్థితులను బట్టి పుట్టబోయే బిడ్డకు శారీరకంగా పరిపుష్టికలిగి ఎదుగుదల అధికంగా ఉంటుందన్నారు. అనంతరం వైద్యఆరోగ్యశాఖ ఎఎన్ఎం విజయలక్ష్మి ఆరోగ్యపరిక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఐరన్, పోలిక్‌యాసిడ్ , విటమిన్ మాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశావాలంటీర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

## ఘంనగా జీతీయ హిందీ దినోత్సవ వేడుకలు



**నెల్లూరు,సెప్టెంబరు14 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్థానిక ఫతేఖాన్‌పేటలోని నారాయణ ఇంగ్లీషుమీడియం పాఠశాలలో జాతీయ హిందీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలల ఏజిఎం రమణారెడ్డి విద్యార్థులకు హింధీలో పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు అన్నీ భాషలోకెల్లా హిందీ బాషచాలా సరళంగా ఉంటుందని, దీనిని నేర్చుకోవటం ద్వారా అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాఘవరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రమీల, డీన్ రమణ, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌కె ఉన్నతపాఠశాలలో హిందీభాషా దినోత్సవ వేడుకలు



వింజమూరు, సెప్టెంబర్14,ప్రభాతవార్త: వింజమూరు మండలం చాకలికొండ గ్రామంలోని ఆర్‌కె ఉన్నత పాఠశాలలో బుధవారం హిందీభాషాదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధా నోపాధ్యాయులు పి.రమేష్ హిందీభాష గురించి వివరిం చారు.తెలుగుభాషతోపాటు హిందీభాషకు ప్రాము ఖ్యతను ఇవ్వాలని హిందీభాషపై మక్కువ పెంచుకోవాలని , హిందీ ప్రయుక్త రాష్ట్రాలకు వెళ్ళినప్పుడు హిందీ తప్పనిసరిగా మాట్లాడాల్సి వస్తుందని కావున విద్యార్థులు వ్రాయడం, చదవడం, మాట్లాడడం నేర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయురాలు సీతామహాలక్ష్మి, ఉపాధ్యాయులు పి.విజయ కుమారి, ఎ.సుభాషిణి, పి.సురేష్, లక్ష్మీప్రసన్న, కృష్ణమూర్తి, నజియా తస్లీమ్, గురుశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయుడు వెలుగోటి కృష్ణ, పాఠశాల సిబ్బంది సూరా రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డి.ఎల్,డి.ఒచే సచివాలయాల తనిఖీ



**జలదంకి,సెప్టెంబర్14,ప్రభాతవార్త:** కావలి డివిజన్ స్థాయి అభివృద్ధి అదికారి కనకదుర్గాభవాని బుధవారం మండలంలోని గట్టుపల్లి,చోడవరం సచివాలయాలను తనిఖీచేశారు.ఈసందర్భంగా రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు.కార్యాలయా పరిధిలోల పదకాల అమలు తీరు నవరత్నాలు అబ్దిదారులకు అందుతున్న వైనాన్ని క్షుణ్ణంగా తలుసుకున్నారు.వార్డు వాలంటీర్లు వారి,వారి పరిధిలోని గృహాలకు అందిస్తున్న సేవలగూర్చి ప్రత్యేంగా ఆరా తీశారు.ఎక్కడా ఎలాంటి అలసత్వం వహించకూడదని ఆదేశం చారు.చోడవరం సచివాలయంలో అయితే ప్రజల బాగుకై ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పదకాలు ప్రవేశపెట్టి అమలు పరస్తున్న విధి విధానాలగూర్చి విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరంగూర్చి తెలియ జెప్పారు.ప్రతిరోజూ సిబ్బంది,వాలంటీర్లు విధిగా ఒక కూడలి,రచ్చబండ,వీధులను ఎంచుకొని ప్రజలతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలు,పదకాలు అమలు అందుతున్న వైనం సేస్తున్న సేవలగూర్చి అవగాహన కల్పించాలని సూచించారు.ఈమేరకు సంబందిత కార్యక్రమం ఫోటోలు తమకు వాట్సప్ మెస్సేజ్ పంపాలని తెలిపారు.దీనివల్ల ఫలితాలు ఎలావుంటాయో అందరికి స్పష్టమవుతుందని వివరించారు.కావున సిబ్బంది అంకితభావం కనపరచాలని ఉద్భోదించారు.సచివాలయాల పరిధిలో అందుతున్న సేవలు ప్రతివక్కరికి తెలిస్తే ఎక్కడైనా సమస్య అనేది వుం టుందా అని ప్రశ్నించారు. ఒక నూతన వ్యవస్థకు శ్రీకారం చుట్టి ఎన్నో ఉద్యోగాలు కల్పించిన ప్రభుత్వానికి ఆశించిన ఫలాలు ప్రజలలోకి వెళ్ళి వారు సుఖంగా వుంటే అంతకంటే తృప్తి మరొకటి వుండదని డి.ఎల్.డి.ఒ విశదీకరించారు.కార్యక్రమంలో ఎం.పి.డి.ఒ ఆదినారాయణ,కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రత్యేక రెవెన్యూసదస్సు

**జలదంకి,సెప్టెంబర్14,ప్రభాతవార్త:** స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం ప్రత్యేక రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసిల్‌దార్ శీతామహాలక్ష్మి ఒక ప్రకటనలో తెలియజేశారు.జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంంలోని భూసంబందిత సమస్యలపరిష్కారం కోసం ఈసదస్సును ఏర్పాటుచేస్తున్నామని ఆమె అన్నారు.ఉదయం పది గంటలనుంచి ఒంటి గంటవరకు సదస్సు వుంటుందని కావున భూసమస్యలు వున్న రైతాంగం దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## పోటీ పరిక్షల్లో నారాయణ ఒలంపియాడ్ విద్యార్థుల ప్రతిభ

**నెల్లూరు సెప్టెంబర్ 14 ప్రభాతవార్త-విద్య** సిఎస్‌ఏపిఎస్ జాతీయస్థాయి పోటీపరిక్షల్లో నగరంలోని స్థానిక రమేష్‌రెడ్డి నగర్‌నందుగల నారాయణ ఒలంపియాడ్ హైస్కూల్ విద్యా ర్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో జరిగిన అ భినందన కార్యక్రమంలో ఏజిఎం రమణారెడ్డి విద్యా ర్థులను అభినందించి మెడల్స్, మెమెం టోలను బహుకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోటీ పరిక్షలు ఏవయినా తమ పాఠశాలకు చెందిన విద్యార్దులు ఉత్తమ ప్రతి భను చాటుతున్నారని కొనియాడారు. జాతీయ స్థాయిలో మంచి మార్కులు సాధించి మెడల్స్‌ను సాధించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ప్రిన్సిపాల్ కీర్తి, అకడమిక్ డీన్ యుగరదర్, వైస్ ప్రిన్సిపాల్ మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్దులు పాల్గొన్నారు.

## మహిళలు తలెత్తలేని పరిస్థితి



**నెల్లూరు సెప్టెంబర్ 14, ప్రభాతవార్త-వైద్యం** వైకాపా ఎమ్మెల్యే కొడాలి.నాని బూతుల వల్ల మ హిళలు తలెత్తుకోలేని పరిస్థితుల్లో రాష్ట్రం ఉందని తెలుగుదేశం పార్టీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మవరం. సుబ్బా రావు బుధవారం ఒ ప్రకటనలో మండిపడ్డారు. వైసీపీలో కొడాలి.నాని లాంటి వాళ్ళ వల్ల రాష్ట్రం దిగజా రిపోతోందని వీళ్ళు చేస్తున్న దౌర్జన్యాలు, హత్యలు, దాడులు అన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. వైకా పా ప్రభుత్వం పోయే కాలం దగ్గర పడిందన్నారు. ఆడవాళ్ళ మీద కూడా నీచంగా బూతులు మా ట్లాడుతున్నారని, మీఇంట్లో కూడా ఆడవాళ్లు ఉన్నారని మాట్లాడే ముందు దానిని దృష్టిలో ఉంచుకుని మా ట్లాడాలని హితవు పలికారు. టీడీపీ భిక్షతో రాజకీయాల్లోకి అడుగుపెట్టిన కొడాలి.నాని రేపు రాబోయేది తెలుగుదేశం పార్టీయేనని అది గుర్తు పెట్టుకుని మాట్లాడాలని నీ ఇష్టమొచ్చినట్లు చంద్రబాబు, లోకేష్ కుటుం బంలోని మహిళలను ఇలాగే విమర్శిస్తే రేపు నీ గతేంటో గుర్తు పెట్టుకో నాని అని సుబ్బారావు హెచ్చ రించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఈ రాష్ట్రంలో మాత్రమే ఇంతటి నీచానికి రాజకీయ నాయకులు దిగజారుతున్నారని ఆయన మండిపడ్డారు. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్య మంత్రే నాయకులకు స్టాక్ కౌంటర్ ఇవ్వమని రెచ్చగొట్టడం చూస్తూంటే ఇది ప్రజలను రెచ్చగొట్టడమేనన్నారు. భువనేశ్వరి, బ్రాహ్మణిలను అకల్పిత ఆరోపణలతో నీచంగా నిందించడం దారుణమన్నారు. మీ పార్టీలో కూడా 150 మంది ఎమ్మెల్యేలు రేపు మా పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మేము మీలాగే ఇలా దిగజారుడు మాట్లాడే మీకు బాధ కలగదాని ప్రశ్నించారు. ఇకనైనా రాజకీయాలను హుందాతనంగా చేయాలని వైసీపీ నాయకులకు ఆయన ఆ ప్రకటనలో హితవు చెప్పారు. నాని ఇకనైనా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు లేకపోతే టీడీపీ కార్యకర్తలు నీకు గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించాడు.

## ఘనంగా నళినమ్మ జన్మదిన వేడుకలు



కలువాయి సెప్టెంబర్ 14 ప్రభాతవార్త కుల్లూరు గ్రామ దత్తత స్వీకరణి మాదాసు నళిని గంగాధరం జన్మదినం పురస్క రించుకొనిబుధవారం గ్రామశక్తిస్వరూపిణి శ్రీ కలువాయమ్మ తల్లి దేవస్థానం నందు పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం ప్రాంగణంలో కేకు కట్ చేసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతు మాదాసు నళిని గంగాదరం జన్మదినం సందర్భంగా గ్రామదేవతకు పూజలు నిర్వహించామని అదే విధంగా ఆమె ఆయు రారోగ్యాలతో ఉండాలని కలువాయమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఈ సందర్భంగా తెలి పారు.ఈకార్యక్రమంలో రావూరు దశయ్య,కుంచేనారాయణ, ఉయ్యాల చిన్నా,తదితరులు పాల్గొన్నారు.

## ఫీజులు చెల్లించలేదని విద్యార్థుల్ని నిర్బంధించడం నీచమైన చర్య



కావలి, సెప్టెంబరు 14 ప్రభాతవార్త ఫీజులు చెల్లించలేదని కావలి శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థుల్ని గదిలో నిర్బంధించడం నీచమైన చర్య అని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ అమ్ముల్లా తెలిపారు. కావలి పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలకు బుధవారం టిఎన్ఎస్ఎఫ్ నేతలు వెళ్లారు. ఫీజుల విషయంలో పాఠశాల సిబ్బంది విద్యార్థుల పట్ల వ్యవహరించిన తీరుని ప్రశ్నించారు. ఈ సందర్భంగా షేక్ అమ్ముల్లా మాట్లాడారు. ఈ బ్రాంచ్‌లో విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఇది రెండోసారి అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే ఎక్కువ ఫీజులు ఈ విద్యాసంస్థ యాజమాన్యం వసూలు చేస్తుందన్నారు. ఫీజుల పట్టిక, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు శ్రీ చైతన్య విద్యాసంస్థ పాటించడం లేదన్నారు. యాజమాన్య నిర్లక్ష్య వైఖరిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఇలాగే కొనసాగితే టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చలో కావలి కార్యక్రమాన్ని చేపట్టి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. వెంటనే బ్రాంచి ప్రిన్సిపాల్ శైలేష్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దార్ల శివకుమార్, చెరుకూరు నవీన్, నాయకులు కిషోర్, మనోజ్, దినేష్, కమల్ తదితరులు పాల్గొన్నారు.

## సుజాతనగర్‌లో సభ్యత్వాల నమోదు



వింజమూరు, సెప్టెంబర్14,ప్రభాతవార్త: వింజమూరు పంచాయతీ పరిధిలో సుజాతనగర్‌లో బుధవారం జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా చల్లా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉదయగిరి మాజీ శాసనసభ్యులు బొల్లినేని వెంకటరామారావు ఆదేశాల మేరకు టిడిపి సభ్యత్వ నమోదు ను విస్తృతంగా చేస్తున్నారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 20వేలకు పైగా సభ్యత్వ నమోదు లక్ష్యంగా పార్టీ నిర్ణయించిందనా న్నరు. ఈకార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు కోడూరు నాగిరెడ్డి, మండల టిడిపి ఉపాధ్యక్షుడు గురజాల వాసునాయుడు, సీనియర్ నాయకులు కొండపల్లి వెంకటేశ్వర్లు , ఐటిడిపి సభ్యులు ఆరికొండ శ్రీనివాసులు, స్థానిక నాయకులు దుర్గంపాటి మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న స్వచ్ఛ సంకల్పం ప్రజలు సహకరించాలి



**కోవూరు సెప్టెంబర్ 14 ప్రభాతవార్త** గ్రామాలు స్వచ్ఛ గ్రామాలుగా తయారు అయ్యేందుకు ప్రజలు పూర్తిగా సహకరించాల్సిన అవసరం ఉందని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజ న్‌బాబురెడ్డి,కోవూరు ఎఎంసి చైర్మన్ రాధాకృష్ణారెడ్డి తెలిపారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ సహకారంతో 8.68 లక్షల వ్యయంతో 21 చక్కరిక్షాలు,126 డస్ట్‌బిన్లు, ఆయా పంచాయితీల సర్పంచ్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్వచ్ఛగ్రామాలపై దృష్టి పెట్టారని దానికి అణుగుణంగా పంచాయితీ పాలక వర్గాలు ప్రజలచే మమేకమై పచ్చదనం పరిశుభ్రత గ్రామాలలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజలు కూడా ఈకార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలన్నారు.ఈకార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు శ్రీలత, ఎంపిపి పార్వతీ,వైస్ ఎంపిపి నరసింహులురెడ్డి, మాజీ టిడిపి చైర్మన్ సుబ్బారెడ్డి,తహసిల్దారు ఎం పద్మజా, ఎంపిడిఒ శ్రీహరి,కార్యలయ పర్యవేక్షకులు చంద్రశేఖర్,ఎంపిటిసి సభ్యులు విజయసేనారెడ్డి,గ్రామ సర్పంచ్ విజయ,పంచాయితీ కార్యదర్శులు అన్ని గ్రామాల సర్పంచ్‌లున్నారు.

## దేవరపాళెంలో పంటకోతల పరిశీలన



**నెల్లూరురూరల్, సెప్టెంబరు14 ప్రభాతవార్త** నెల్లూరురూరల్ మండలం దేవరపాళెం గ్రామంలో పంట కోతలను వ్యవసాయశాఖ ముఖ్యకార్యనిర్వహణాధికారి సారెంరాజు బుధవారం పర్యవేక్షించారు. రైతులకు తగు సూచనలు చేశారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నమ్మిన ప్రజలను గాలికొదిలేసిన మాజీమంత్రి అనిల్



నెల్లూరు,సెప్టెంబరు14 ప్రభాతవార్త-విద్య తనను నమ్మి ఓట్లు వేసి గెలిపించిన నగర ప్రజలను గాలికి వదిలేసి నమ్మక ద్రోహిగా మిగిలిపోయిన ఘనత మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌కే దక్కుతుందని జనసేన జిల్లా అధ్యక్షులు మనుక్రాంత్ చెన్నారెడ్డి ద ్యజమెత్తారు. ఇటీవల కురిసిన వర్షాలకు నగరంలోని స్థానిక భగత సింగ్ కాలనీలో కొట్టుకుపోయిన రోడ్లు, పేదల ఇండ్లను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం విలే కరులతో మాట్లాడుతు ఎన్నికల ముందు పాతచెక్‌పోస్టు, బరష్మాల గుంట, రైల్వే లైన్ ఏరియా, వెంకటే శ్వ రపురం, గాంధీ గిరిజన కాలనీ తదితర ప్రాంతాల్లో నివాసముంటున్న పేదలకు పక్కా ఇండ్లు కట్టించి ఇస్తా మని అనిల్ హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యేగా గెలిచి మ ంత్రిగా అయినా ఇక్కడ వారి బ్రతుకులు బాగు పడ లేదన్నారు. ఇచ్చిన హామీలను మరిచి తన స్వార్థం చూసుకున్నారని,విచ్చలవిడిగా అవినీతికి పాల్పడి వందల కోట్లు సంపాదించారి ఆరోపించారు. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షాలకే భగత్ సింగ్ కాలనీలో ఇండ్లు, రోడ్లు కొట్టుకుపోయాయని, దీనిని చూస్తేనే అవినీతి ఏస్థాయిలో జరిగిందో అర్థమౌతుందన్నారు. మాజీ ఇరిగే షన్ శాఖమ ంత్రి అనిల్ అసమర్థత వల్లనే అన్నమయ్య డ్యాంకు మెయింటినెన్స్‌కూడా సరిగ్గా చేయలేదని, సకా లంలో గేట్లు తెరుచుకోక పోవటంతో డ్యాం కొట్టుకుపోయిందని వందల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని, అనేక కుటుంబాలు గూడును కోల్పవాల్సి వచ్చిందన్నారు. డ్యాం కొట్టుకుపోవటం ద్వారా జరిగిన ప్రాణ నష్టానికి అనిల్, ప్రభుత్వమే కారణమన్నారు. అనంతరం జనసేన నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు మాట్లాడుతు వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రశాంతంగా ఉన్న నెల్లూరు నగరం క్రైమ్ నగరంగా మారిందని దుయ్యబట్టారు. నేరాలు, మానబంగాలు, అత్యాచారాలు, కొట్లాటలు, రౌడీయిజానికి నగరం అడ్డాగా మారిం దన్నారు. నేరస్తులకు వైకాపా నాయకులు అండగా ఉండటం సిగ్గుచేటన్నారు. పెన్నా నదికి ఇరువైపులా సైడ్ వాల్స్ నిర్మాణం కోసం అన్నీ పార్టీలు కలిసి అనేకమార్లు వినతులు ఇవ్వటం జరిగిందన్నారు. ఎంతో కృషి తర్వార ప్రారంభమైన వాల్స్ నిర్మాణం నాసిరకంగా జరుగుంతన్నారు. ఇలానే పనులు జరిగితే రానున్న రోజు ల్లో భారీగా ఆస్తినష్టం, ప్రాణనష్టం సంభవిస్తుందన్నారు. ప్రభుత ్వంపై ప్రజలు ఎంతో వ్యతిరేఖతతో ఉ న్నారని దీనిని గమనించి ఇప్పటికైనా నాయకులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలని కోరారు. జనసేన జిల్లా ప్రధానకార్యదర్శి గునుగుల కిషోర్, వరకుమార్, సుల్తాన్, కంతర్, వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు, ప్రజాప్రతినిధులు సలహాలు మాకెంతో ఉపయోగం

**కోవూరు సెప్టెంబర్ 14 ప్రభాతవార్త** కోవూరు మండలంలోని అన్ని శాఖల అధికా రు లు,పోలీస్ అధికారులు ప్రజాప్రతినిదులు ఇచ్చి న సలహాలు సూచనలు తమ కెరీరెలో ఎం తోగానో ఉపయోగపడుతున్నాయని గ్రామ సచి వాలయ మహిళా పోలీసులు తెలిపారు. కోవూ రులోని సర్కిల్ కార్యాలయంలో బుధవారం 16 సచివాలయాలకు సంబందించిన మహిళా పోలీసులకు ప్రొబిషన్ పిరియడ్ పూర్తి అయిన సందర్భంగా అధికారులకు ప్రజాప్రతినిదులకు శాలువాలు,పూలమాలలతో సన్మానించారు. ప్రజా ప్రతినిదులు మాట్లాడుతు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేసి వారి కుటుంబాలలో వెలుగులు నింపారని అన్నారు. సచివాలయ ఉద్యోగులు కూడా ప్రభుత్వం అందిస్తున్న పధకాలను అర్హులందరికి అందేలా దృష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఎఎంసి చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, తహసిల్దారు పద్మజా, ఎంపిడిఒ శ్రీహరి, ఎస్ఐ బి వెంకటేశ్వరరావు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## వృద్ధులకు అల్పాహారం పంపిణీ



**బుచ్చి సెప్టెంబర్ 14 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రేబాల గ్రామంలోని నిరుపమా సీనియర్ సిటిజన్ హోం నందు గల వృద్దులకు క్రీమ్ సంస్థ ఆద్వర్యంలో బుధవారం సంస్థ అద్యక్షులు తడిసిన ఇజ్రాయిల్ వృద్దులకు అల్పాహారం పంపిణి చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు క్రీమ్ సంస్థ ఆద్వర్యంలో వృద్దులకు చేయూత నందిస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే పేద విద్యార్దులకు తమ వంతు సహా యసహాకారాలు అందిస్తున్నామని అన్నారు. మేనేజర్ శేషాద్రి, ఇన్‌చార్జి రాజు, తదితరులు పాల్గోన్నారు.

## రైల్వే స్టేషన్‌లో విద్యుత్ స్తంభం ఎక్కి యువకుడు ఆత్మహత్యాయత్నం



**బిట్రగుంట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో బుధవారం జార్ఖండ్‌కు చెందిన జట్టా కండీర్ అనే యువకుడు విద్యుత్ స్తంభం ఎక్కి ఆత్మహత్య చేసుకోబోయి తీవ్రంగా గాయపడిన సంఘటన జరిగింది. దీనికి సంబంధించి కావలి జిఆర్‌పి ఎస్ఐ అరుణకుమారి కథనం మేరకు వివరాలు ఇలావు న్నాయి. జార్ఖండ్‌కు చెందిన జట్టా కండీర్ కేరళలోని మున్నారు టీ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. తన ఇద్దరి చిన్న పిల్లలతో జార్ఖండ్‌కు ఇటీవల వెళ్లాడు. ఈ నెల 10వ తేదిన సుమారు 8,5 సంవత్సరాల ఇద్దరు పిల్లలతో కేరళకు బయలుదేరాడు. ఈ నెల 13వ తేదిన బిట్రగుంట రైల్వే స్టేషన్‌కు వచ్చే సరికి తన ఇద్దరు పిల్లలు కనిపించలేదని ఆ సమాచారాన్ని కేరళలో వున్న తన భార్యకు తెలిపాడు. దీంతో విసిగి మనస్థాపం చెంది తన బిడ్డలు కనిపించలేదని రైల్వే స్టేషన్‌లో విద్యుత్ స్తంభం ఎక్కి ఆత్మహత్య చేసుకోబోగా విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలతో బయటపడ్డాడు. గాయపడిన యువకుడిని 108 వాహనం ద్వారా ఆర్‌పిఎఫ్ సిబ్బంది కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇదిలావుండగా ఈ నెల 13వ తేదిన గూడూరులో ఇద్దరు పిల్లలు తప్పిపోయారన్న తెలుసుకున్న పోలీసులు వారిని సంరక్షించేందుకు చిల్డ్రన్ హోమ్‌కు తరలించారు. ఈ సమాచారాన్ని సోషల్ మీడియాలో చూసిన జిఆర్‌పి ఎస్ఐ అరుణకుమారి గాయపడ్డ ఆ యువకుడుకి ఆ ఫోటోలు చూపించడంతో తన పిల్లలే అని ఆయన గుర్తించాడు. జరిగిన విషయాన్ని కేరళలో వున్న ఆయన భార్యకు తెలియపర్చి కేసును జిఆర్‌పి ఎస్ఐ అరుణకుమారి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉపాధి హామీ పనులు పరిశీలన



**బిట్రగుంట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త** బోగోలు మండలం బోగోలు చెరువు వద్ద బుధవారం ఉపాధి కూలీలు చేస్తున్న పనులను ఎంపిపి మేకల సుజాత ఆదేశాల మేరకు వైసిపి మండల యువత అధ్యక్షుడు మేకల శ్రీనివాసులు పరిశీలించారు. వర్షాకాలం వచ్చేలోగా ఈ పనులన్ని పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఉపాధి హామీ సిబ్బందికి ఆయన సూచించారు.

## కరుణాకర్ కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన చిలకపాటి



**కావలి రూరల్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త** వైసిపి నేతల వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న దళిత యువకుడు దుగ్గిరాల కరుణాకర్ కుటుంబానికి మధ్యతరగతి కుటుంబానికి చెందిన చిలకపాటి మనోహర్ హుండీలో దాచుకున్న నగదును అందజేసి అందరి ప్రశంసలు పొందారు. కావలి పట్టణం వెంగళరావునగర్‌కు చెందిన చిలకపాటి మనోహర్, సుగుణ దంపతులు దేవుడి హుండీలో గత కొన్ని సంవత్సరాలుగా దాచుకున్న 25 వేల రూపాయలను కరుణాకర్ కుటుంబ సభ్యులకు మిత్రులతో కలిసి బుధవారం అందజేశారు. దాతృత్వం చాటుకున్న చిలకపాటి మనోహర్, సుగుణ దంపతులకు సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు కరవది భాస్కర్ జార్జ్, చిలకపాటి మధుబాబు, పిన్నిబోయిన చరిత్రకుమార్, ప్రభావతిలు పాల్గొన్నారు.

## సచివాలయ సిబ్బంది బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి



**వెంకటాచలం సెప్టెంబర్ 14 ప్రభాతవార్త** వెంకటాచలం మండలంలోని అన్ని సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు యూనియన్ బ్యాంకు అందిస్తున్న బ్యాంకులను సద్వినియోగం చేసుకోవాలని వెంకటాచలం యూనియన్ బ్యాంకు మేనేజర్ డిఎస్ దీపక్ ఒక ప్రకటనలో చెప్పారు. తమ బ్యాంకు ద్వారా సచివాలయంలో పనిచేసే ఉద్యోగులకు రుణాలు మంజూరు చేయటానికి సిద్దంగా ఉన్నామన్నారు. రుణాలు మంజూరు చేయడం ద్వారా ప్రజలు ఆర్దిక స్దిత గతులను మెరుగు పరచాలన్నదే తమ అభిమతమని అయన చెప్పారు. రైతులకు వ్యవసాయ రుణాలు, పాడి రైతులకు గేదెల కొనుగోలు రుణాలు, ఇవ్వనట్లు తెలిపారు. తక్కువ వడ్డితో బంగారంపై రుణాలు ఇస్తామని వెల్లడించారు. మహిళలకు ముద్ర రుణాలు మంజూరు చేయనట్లు తెలిపారు. యూనియన్ బ్యాంకులో ఖాతాదారులు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి బ్యాంకు చెల్లించాలన్నారు. త ద్వారా మరింత మందికి రుణాలు ఇవ్వడానికి ఆస్కారం కలుగుతుందని అయన చెప్పారు. యూనియన్ బ్యాంకు సేవలను రైతులు, ఉద్యోగులు ఖాతాదారులు ప్రజలు సద్వినియోగం చేసుకోవలన్నారు.

## సచివాలయాన్ని పరిశీలించిన తహసిల్దారు



**బుచ్చి సెప్టెంబర్ 14 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని నాగమాంబాపురం సచివాలయాన్ని తహసిల్దారు ప్రమీల పరిశీలించారు. ఈ సందర ్భంగా ఆమె రీసర్వే గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే వేగవంతం చేయాలని చెప్పారు. ప్రభుత్వ భూములు గుర్తించేటప్పుడు జాగ్రత్తగా గుర్తించాలని అన్నా రు. సచివాలయ సిబ్బంది పనితీరును ఆమె అభినందించా రు. ఈ కార్య క్రమంలో సచివాలయ సిబ్బంది, సర్వేయర్లున్నారు.

## 13 ఏళ్ళ తర్వాత వెనక్కివచ్చిన ఉద్యోగుల డబ్బులు



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త** జిల్లా ఎన్‌జిఓ అసోసియేషన్‌కు సంబంధించి నెల్లూరుజిల్లా ఎన్‌జిఓస్ మ్యాక్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్‌లో సభ్యులుగా చేరి ఇండ్ల ప్లాట్లకై ప్రభుత్వానికి ఉద్యోగులు కట్టిన డబ్బులు 13 సంవత్సరాల తర్వాత వెనక్కివచ్చాయని జిల్లా ఎన్‌జిఓ సంఘ అధ్యక్షులు మన్నేపల్లి పెంచలరావు పేర్కొన్నారు. బుధవారం నెల్లూరు దర్గామిట్టలోని ఎన్‌జిఓహోమ్‌లో ఇందుకు సంబంధించి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2009లో హౌస్ బిల్డింగ్ సొసైటీలో సభ్యత్వం కోసం రూ. 500 రూపాయలు, ప్లాట్‌కు అడ్వాన్స్‌గా మరో రూ. 2 వేల రూపాయలు మొత్తం జిలాలోని రెండువేల మంది ఉద్యోగులు కట్టడం జరిగిందన్నారు. ఉద్యోగుల ప్లాట్లకై అప్పట్లో కేటాయించబడ్డ 90ఎకరాల భూమి రద్దు కాగా కొంతమంది ఉద్యోగులు తాము కట్టిన డబ్బులను సొసైటీ నుండి వెనక్కి తీసుకోగా మిగిలిన ఉద్యోగులకు చెందిన 1,18,22,200 ప్రభుత్వం వద్దనే వుండిపోవడం జరిగిందన్నారు. అప్పటినుండి ఆ నిధులను వెనక్కి తీసుకువచ్చేందుకు ఎన్‌జిఓ సంఘానికి నాయకత్వం వహించిన వారు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయిందన్న పెంచలరావు ఈ విషయాన్ని గత ఏడాది ప్రస్తుత జిల్లా కలెక్టర్ కేవీఎన్‌చక్రధర్‌బాబు దృష్టికి తీసుకుపోగా తక్షణమే ఆయన స్పందించడం సీఎఫ్‌ఎంఎస్ సీఈఓకు ఫోన్ చేయడంతోపాటు ప్రభుత్వానికి లేఖ వ్రాయడంతో మొత్తం నిధులు వెనక్కి వచ్చాయన్నారు. కాగా ఆయా నిదులను డబ్బులు కట్టిన ఉద్యోగులకు చెక్కుల రూపంలో ఇవ్వడం జరుగుతుందన్న జిల్లా ఎన్‌జిఓ సంఘనేత మొదటిచెక్కును ఈనెల 30న జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఇప్పిస్తామన్నారు. కాగా ఈ సమావేశంలో ఎన్‌జిఓ సంఘ కార్యదర్శి నాయుడువెంకటస్వామి, లక్కాకుల పెంచలయ్య, బలిజేపల్లి వెంకటేశ్వర్లు, ఈదూరు కరుణమ్మ, గంగపట్నం మాదవయ్య, నెల్లూరుజిల్లా ఎన్‌జిఓస్ మ్యాక్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షకార్యదర్శులైన ఎం.వెంకటేశ్వరరాజు, ఎస్.చిన్న అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## కావలి ఉదయగిరి బ్రిడ్జిపై మరమ్మతులు ప్రారంభం



**కావలి, సెప్టెంబరు 14 ప్రభాతవార్త** కావలి పట్టణ ఉదయగిరి బ్రిడ్జిపై మరమ్మతు పను లను నేషనల్ హైవే వారు బుధవారం చేపట్టారు. గత కొన్ని సంవత్సరాలుగా ఉదయగిరి బ్రిడ్జిపై గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల వల్ల ప్రమాదాలు జరిగి కొంతమంది మృత్యువాత కూడా పడ్డారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ మాలేపాటి సుబ్బానాయుడు తుమ్మలపెంట రోడ్డు, కావలి పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జిలను పునర్నిర్మాణం చేపట్టాలని మంగళవారం కావలి ఆర్అండ్‌డి ఇఇని కలిసి వినతి పత్రం అందజేశారు. అంతేకాకుండా నేషనల్ హైవే వారితో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే ఉదయగిరి బ్రిడ్జిపై మరమ్మతులు చేపట్టాలని కోరారు. దీంతో నేషనల్ హైవే వారు ఉదయగిరి బ్రిడ్జిపై మరమ్మతు పనులను చేపట్టారు.

## 16న ఆనంద్ వైద్యశాలలో ఉచిత వైద్యశిబిరం



**కావలి రూరల్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త** కావలి పట్టణం రామమూర్తిపేటలోని సాయిబాబా ఆలయం వద్ద వున్న ఆనంద్ హాస్పిటల్‌లో ఈ నెల 16వ తేది ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆనంద్ హాస్పిటల్ బాధ్యులు డాక్టర్ ఆనంద్ తెలిపారు. ఈ శిబిరంలో ప్రముఖ ఆర్థో నిపుణులు డాక్టర్ శశిధర్ పాల్గొని రోగులను పరీక్షించి వారికి తగిన సలహాలు, సూచనలు అందజేస్తారని తెలిపారు. ఎముకల పటుత్వానికి సంబంధించి బోన్ మేనరల్ డెన్సిటీ టెస్ట్ ఉచితంగా చేసి మందులు కూడా ఉచితంగా అందజేస్తారని తెలిపారు. ముఖ్యంగా 40 సంవత్సరాలు పైబడిన వారు, దీర్ఘకాలిక నొప్పులతో బాధపడే వారు, మినోపాస్ దాటిన స్త్రీలు, ఆహార లోపాలు వున్న వారు, చిన్న పిల్లలకు ఈ వైద్యశిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందని డాక్టర్ శశిధర్ తెలిపారు. ఈ అవకాశాన్ని కావలి, పరిసర ప్రాంతాల ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## శిద్దన కొండూరు హైస్కూల్లో ఘనంగా హిందీ దినోత్సవ వేడుకలు



కలిగిరి, శప్టెంబర్ 14, ప్రభాతవార్త;కలిగిరి మండలంలోని శిద్దనకొండూరు హైస్కూల్లో హిందీ దినోత్స వ వేడుకలు బుదవారం నంగా జరుపుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంమోహన్ ఆద్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్బంగా హిధీ బాష ప్రాముక్యతపై విధ్యార్ధినీ విద్యార్దులచే ప్రాజెక్టు వర్క్‌చేయించారు. గెలుపొందిన వారికి మెమొంటోలు అందజేశారు. ఈ క్రమంలో హింధీ ఉపాధ్యాయునులైన లక్ష్మీ ప్రసన్న, శైలజలను ఉపాధ్యాయులు, విధ్యార్దులు ఘనంగా సన్మానించారు. అనంతరం విధ్యార్దులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్బంగా ప్రదానోపాధ్యాయులు మాట్లాడుతూ రాష్ట్ర భాష తెలుగు ఎలాగో దేశభాష హింధీకూడా అంతే ప్రాముక్యథ సంతరించుకుందన్నారు. తెలుగు నేర్చుకుంటే కొన్ని ప్రాంతాలలో తిరగ వచ్చని అదే తెలుగుతోపాటు హింధీకూడా నేర్చుకుంటే దేశంలో ఎక్కడా తిరుగు ఉండదన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు ,విధ్యార్దులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసి బస్ కిందపడి వ్యక్తి మృతి

**కలిగిరి, సెప్టెంబర్14, ప్రభాతవార్త;**కలిగిరి మండలం కావలి ముస్తాపురం కూడలి వద్ద నెల్లూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుదవారం చోటు చేసుకుంది. కలిగిరి యస్ఐ సూర్య ప్రకాష్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు ఏయస్ పేట మండలం, గుంపర్లపాడుకు చెందినమద్దెల మాల కొండయ్య(65) ముస్తాపురం సెంటర్లో బస్‌కోసంఉండగా ప్రమాద వశాత్తు బస్‌కిందపడి కాళ్లు ఇరిగి పోయాయన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే వైద్యంకోసం నెల్లూరుకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. మృతుని బందువులు ఇచ్చిన పిర్యాదుమేరకు బస్ డ్రైకర్‌పై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. కాగా మృతునికి చిన్నతనం నుండే రెండుకళ్లు కనపడవని అందులోబాగంగానే ప్రమాదవశాత్తు బస్‌కింద పడి ఉండవచ్చని పోలీసలులు తెలిపారు.

## రైతు భరోసాకేంద్రం తనిఖీ



**అనంతసాగరం, సెప్టెంబర్14, ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల రైతు భరోసాకేంద్రాన్ని బుధవారం జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు, ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు దేవసేన లు తనిఖీ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఈ-పంట నమోదు, రిజిస్టర్‌ల ను తనిఖీ చేశారు. అక్కడ ఉన్న రైతులను వారి అవసరాలను అడిగి తెలుకున్నారు. అందులో భాగంగా రైతులు వ్యవసాయ నిముట్లను , జింకు , జిప్సంను సబ్సిడీగా ఇవ్వాలని కోరారు. అనంతరం మండలంలోని మినగల్లులో నూతనంగా నిర్మిస్తున్న రైతు భరోసాకేంద్రాన్ని పరిశీలించారు. ఈకార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు బి.శివారెడ్డి, వెంకటేశ్వర్లు, సి.హెచ్.కీర్తి, వైకాపా నాయకులు గుండుబోయిన ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ కార్యవర్గ సమావేశాలను జయప్రదం చేయాలి



**నెల్లూరు టౌన్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** ఈ నెల 19న విశాఖపట్నంలోని ఉత్తరాంధ్ర ఉద్యమ శిఖరం పెద్దాడ ప్రకాశరావు మాదిగ సభాప్రాంగణంలో జరిగే ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి, ఎంఎస్ఎఫ్, ఎంఎఫ్ఎఫ్ అనుబంధ సంఘాల జాతీయ కార్యవర్గ సమావేశాలను జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రచార నిర్వాహక కమిటీ కన్వీనర్ మస్తాన్ మాదిగ తెలిపారు. బుధవారం స్థానిక డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవనం నందు జిల్లాలోని ఎంఆర్‌పిఎస్ అనుబంధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో జరిగే జాతీయ కార్యవర్గ సమావేశానికి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, మహాజన సోషలిస్టు పార్టీ అధినేత మంద కృష్ణ మాదిగ నాయకత్వం వహిస్తారన్నారు. అనంతరం ఆయన ఆదేశాలతో భవిష్యత్తు కార్యచరణ ప్రకటిస్తాంన్నారు. ఈ సమావేశానికి జిల్లాలోని అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు సెప్టెంబరు 18 రాత్రికి విశాఖపట్నం చేరుకోవాలన్నారు. ఎంఎస్‌పి జిల్లా నాయకులు మంద పెంచలయ్య మాదిగ మాట్లాడుతూ జిల్లాలో గ్రామస్థాయి నుంచి నూతన నాయకత్వాన్ని బలోపేతం చేయాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ మలిదశ పోరాటానికి మాదిగలు, మాదిగ ఉపకులాలు ఐక్యంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు మల్లెల తిరుమలేష్ మాదిగ, ఎంఎస్‌పి జిల్లా నాయకులు కోలగట్ల రమేష్ మాదిగ, పందిటి అంబేద్కర్ మాదిగ, తాళ్లూరు శేషయ్య మాదిగ, విహెచ్‌పిఎస్ జాతీయ నాయకులు గూడూరు వెంకటరమణయ్య, నగర అధ్యక్షులు మంద సుకుమార్, మంద సుజాత, చిడదల శ్రీనివాస్ మాదిగ, అలిజంగి నాగయ్య మాదిగ, జి.నాగరాజు మాదిగ, కొంగి వెంకటరమణయ్య మాదిగ, కావలి శ్రీను మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన రిటైర్డ్ రెవెన్యూ అధికారులు



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త** నెల్లూరుజిల్లా రెవెన్యూ రిటైరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ పేరిట సంఘంగా ఏర్పడ్డ రిటైర్డ్ రెవెన్యూ అధికారులు బుధవారం జిల్లా కలెక్టర్ కేవీఎన్‌చక్రధర్‌బాబును క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సుదీర్ఘకాలం రెవెన్యూశాఖలో వివిధ హోదాలలో పనిచేసిన వారు జిల్లా అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని, తమ సేవలను వినియోగించుకోవాలని వారు ఈ సందర్భంగా కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నెల్లూరుజిల్లా రెవెన్యూ రిటైరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ముత్యం నరసింహులు, కార్యదర్శి దూర్జటి వెంకటసుధాకర్, అసోసియేట్ అధ్యక్షులు జి.వేణుగోపాలరావు, ఉపాధ్యక్షులు పి.జనార్దన్‌రావు, సిరాజ్‌మొగల్, గోవిందస్వామి, కోశాధికారి ఎస్.మస్తానయ్య, గౌరవ సలహాదారులైన చల్లా పెంచలరెడ్డి, కే.రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌చే పుస్తకావిష్కరణ



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త** జిల్లాలో చారిత్రక ప్రా ధాన్యత కలిగిన ఉదయ గిరి దుర్గాలకు సంబంధించి విశ్రాంత తహసీల్దార్ పొ ట్లూరు సుబ్రమణ్యం రచించిన ఉద య గిరి దుర్గం కథల పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ కేవీఎన్‌చక్రధర్‌బాబు బుధవారం క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత రెవెన్యూ అధికారులయిన చల్లా పెంచలరెడ్డి, జి.వేణుగోపాలరావు, ముత్యంనరసింహులు, దూర్జటి వెంకటసుధాకర్, పి.జనార్దన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ఎన్‌జిఓ సంఘనేతలు



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త** ఏపిఎన్‌జిఓ అసోసియేషన్ జిల్లా సంఘనేతలు జిల్లా అధ్యక్షకార్యదర్శులైన మన్నేపల్లి పెంచలరావు-నాయుడు వెంకటస్వామిల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ కేవీఎన్‌చక్రధర్‌బాబును కలిశారు. ఇండ్లప్లాట్లకై జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు 2009లో జిల్లా ఎన్‌జిఓ అసోసియేషన్‌కు సంబంధించి నెల్లూరుజిల్లా ఎన్‌జిఓస్ మ్యాక్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్‌లో సభ్యులుగా చేరి కట్టిన సభ్యత్వరుసుం, ఇండ్లప్లాట్లకై కట్టిన అడ్వాన్స్ మొత్తాన్ని తిరిగి వారికి వచ్చేలా కృషిచేసిన కలెక్టర్‌కు ఎన్‌జిఓ సంఘనేతలు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కలెక్టర్‌ను కలిసినవారిలో ఎన్‌జిఓ సంఘ ప్రతినిధులయిన లక్కాకుల పెంచలయ్య, బలిజేపల్లి వెంకటేశ్వర్లు, ఈదూరు కరుణమ్మ, గంగపట్నం మాదవయ్య, నెల్లూరుజిల్లా ఎన్‌జిఓస్ మ్యాక్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షకార్యదర్శులైన ఎం.వెంకటేశ్వరరాజు, ఎస్.చిన్న అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## దేవాంగ అధ్యక్షులు నాగరాజు జన్మదిన వేడుకలు



**పొదలకూరు సెప్టెంబర్ 14 ప్రభాతవార్త** పొదలకూరు పట్టణం దేవాంగ వీధిలో శ్రీరామలింగ చాముండేశ్వరీదేవి ఆలయంలో బుధవారం రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అద్యక్షులు డికె నాగరాజు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాంగ సభ్యులు కేకు కట్ చేసి అందరికి పంచిపెట్టారు. అద యక్షులు నాగరాజు పూజారికి నూతన వస్త్రాలు బహుకరించారు. ఈ సందర్బంగా రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అసోసియేట్ మెంబర్ పముజుల శంకరయ్య మాట్లాడుతు నాగరాజు పలు సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్నారని దేవాంగుల సంక్షేమాభివృద్ధి ధ్యేయంగా పలు కార ్యక్రమాలను పక్కా ప్రణాళికతో నిర్వహించేందుకు తోడ్పడుతున్నారని అన్నారు. అలాగే ఆయన అద్యక్షతన రాష్ట్ర దేవాంగ సంక్షేమసంఘం నూతన కార్యవర్గం అక్టోబర్ 9 వ తేదిన ప్రమాణస్వీకార కార్యక్రమం కూడా ఖరారైందని తెలిపారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా దేవాంగులందరు హాజరుకావాలని సూచించారు. ఈకార్యక్రమంలో పొదలకూరు దేవాంగ సంక్షేమ సంఘం సభ్యులు కటికాల పోలయ్య, మదిర రాజారత్నం, మదిర కాలయ్య, మదిర సుబ్బరాయులు, పడవల రవికుమార్, బి సుబా ్బరావు, చప్పరం వాసు, పడవల రవి, ఆలయపూజారి పడాల శంకరశాస్త్రి పాల్గోన్నారు.

## విశ్వనాధరావుపేటలో ముగిసిన గడపగడపకు మన ప్రభుత్వం



**బిట్రగుంట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త** బోగోలు మండలం విశ్వనాధరావుపేట మేజర్ పంచాయతీలో గత మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం కొత్తూరు గ్రామంలో ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామిరెడ్డిప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుతో పాటు గ్రామంలో కల్పించాల్సిన వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రహదారులు అధ్వానంగా వున్నాయని చినుకు పడితే బురదమయంగా వుందని స్థానికులు ఆయన దృష్టికి తేగా ఈ కార్యక్రమం ముగిసిన వెంటనే సచివాలయానికి 20 లక్షల రూపాయల వంతున మంజూరై వున్నాయని వాటితో రోడ్లు,డ్రైన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్రామంలో విద్యుత్ ఫీడర్ రూరల్ ప్రాంతంలో వుందని దీన్ని మెయిన్ ఫీడర్‌కు మార్చాలని విజ్ఞప్తి చేశారు. రూరల్ ఫీడర్‌లో వున్నందున తాగునీటి పథకానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జ్ ఎంపిడివో గోవిందరావు, గ్రామ సర్పంచ్ గందూరు మంజుల, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, ఎంపిపి మేకల సుజాత, మండల పార్టీ కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, ఎంపిటిసిలు ఎ.కె. సుందర్‌రాజ్, మద్దిబోయిన పద్మ, పార్టీ నేతలు టి.పెంచలయ్య, పి.అంకులయ్య, సచివాలయ సిబ్బంది, వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



**కావలి, సెప్టెంబరు 14 ప్రభాతవార్త** కావలిలోని శ్రీ చైతన్య పాఠశాలలో ఫీజుల పేరుతో విద్యార్థుల్ని నిర్బంధించి, ఒక విద్యార్థినిని మోకాళ్ళపై కూర్చోబెట్టి వేధించిన ఆ పాఠశాల యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు, జనసేన పార్టీ నేతలు డిమాండ్ చేశారు. కావలి డిప్యూటీ డిఇవో కార్యాలయంలోని సిసికి బుధవారం వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కరవది భాస్కర్, జనసేన పట్టణ అధ్యక్షులు పొబ్బ సాయిలు మాట్లాడారు. కావలి డివిజన్‌లోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీ ఎక్కువగా వుందన్నారు. ఫీజుల నియంత్రణలో ప్రభుత్వ జీవోలు అమలు చేయడం లేదని విమర్శించారు. విద్యాహక్కు చట్టం అమలు కావడం లేదన్నారు. కనీస సౌకర్యాలు కూడా పాఠశాలలో లేవన్నారు. విద్యార్థులను దండించడం, ఫీజుల పేరుతో వేధించడం సర్వసాధారణమైందన్నారు. ఈ విద్యాసంస్థలపై ప్రభుత్వ నియంత్రణ లేదన్నారు. తక్షణమే విచారించి శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, నయీమ్, నాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వైభవంగా గంగమ్మ తిరునాళ్ల



**కందుకూరు, సెప్టెంబర్14, ప్రభాతవార్త** గుడ్లూరు మండలం కొత్తపేట గంగమ్మ తిరునాళ్ల మహోత్సవం వైభవంగా జరిగింది. బుధవారంతో వేడుకలుముగిసాయి. ఈ తిరునాళ్ల మహోత్సవానికి కందుకూరు శాసనసభ్యుడు మానుగుంట మహీధర్‌రెడ్డి హాజరైయ్యారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగమ్మ తల్లి అందరినీచల్లగా చూడాలని అలాగే వర్షాలు సకాలంలో వేడుకున్నట్లు చెప్పారు. ఆ తల్లి కరుణా కటాక్షాలతో గ్రామస్తులు ఉండాలిన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు డిఎస్పీ కండె శ్రీనివాసరావు, ఎస్సై ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ పులి రమేష్, సర్పంచ్ గంగయ్య, వైసీపి నేతలు నరసారెడ్డి ,వెంకట నారాయణ, నారపురెడ్డి, గుడ్లూరు సర్పంచ్ పాలకీర్తి శంకర్ తదితరులు హాజరైయ్యారు.

## రాష్ట్ర పురస్కారాలకు ఎంపికైన జిల్లా ఇంజనీర్లు



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త** జిల్లాకు చెందిన ముగ్గురు ఇంజనీర్లు రాష్ట్ర పురస్కారాలకు ఎంపికయ్యారు. డాక్టర్ సర్వే పల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకొని జరుపుకొనే ఇంజనీర్స్‌డే నాడు ఈ ముగ్గురు ఇంజనీర్లకు రాష్ట్రస్థాయిలో విజయవాడలో జ రిగే కార్యక్రమంలో రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు ఈ పురస్కారాలను అందజేయనున్నారు. జిల్లాకు చెందిన తెలుగుగంగ ప్రాజెక్ట్ సూపరెండెంట్ ఇంజనీర్ కె.హరినారాయణరెడ్డి, జలవనరులశాఖ సూపరెండెంట్ ఇంజనీర్ కె.కృష్ణ మోహన్, డ్రైనేజీ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.పద్మలు ఈ పురస్కారాలు అందుకోనున్నారు.

## యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి లేకుంటే టిడిపియేలేదు



**బుచ్చి సెప్టెంబర్ 14 ప్రభాతవార్త** వైసిపి నాయకులు పెన్నాడెల్టా ప్రాజక్టు మాజీ చైర్మన్ యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డిని విమర్శించే స్థాయి జూగుంట పురుషోత్తమ్‌కి లేదని వైజీఆర్ యువసేన నాయకులు,వైసిపి మండల పార్టీ కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి విమర్శించారు. రేబాల గ్రామంలో వైజీఆర్ యువసేన నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు అధికారం ఎక్కడ వుంటే అక్కడికి గోవర్ధన్‌రెడ్డి వెళతడాని జూగుంట పురుషోత ్తమ్ విమర్శించడం సబబుకాదని అన్నారు. 2013లో పురుషోత్తమ్ వైసిపి తరపున గెలిచి టిడిపిలోకి వెళ్లి ఆయన మరలా గోవర్ధన్‌రెడ్డిని విమర్శించడం ఏమిటని వారు ప్రశ్నించారు. యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి లేకుంటే టిడిపియే లేదని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో గోవర్ద న్‌రెడ్డి లేకుండా వున్నందువల్ల వచ్చిన ఫలితాలు గుర్తు చేసుకోవాలని అన్నారు. గోవర్ధన్‌రెడ్డి జిల్లా స్థాయి నాయకుడు ఆయనను విమర్శించే స్థాయి నీకుందా అని వారు ప్రశ్నించారు. మరోసారి గోవర్ధన్‌రెడ్డిని విమర్శిస్తే సహించేదిలేదని వారు హెచ్చరించారు. అనంతరం మైనార్టీ నాయకులు రియాజ్ మాట్లాడుతు పురుషోత్తం నువ్వు నాయకుడివి కాదు కేవలం సర్పంచ్ భర్తవి మాత్రమే ఆ విషయాన్ని గుర్తుంచుకో అని వారు విమర్శించారు. యర్రంరెడ్డికి 30 ఏళ్ల చరిత్ర ఉంది .ఆయన వెనుక మండలస్థాయిలో ఒక వర్గం ఉంది కనీసం నువ్వు వార్డు స్థాయి నాయకుడివి కూడా కాదు. మరోసారి మానాయకుడ్ని విమర్శిస్తే తగిన గుణపాఠం చెబుతాం అని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో వైజీఆర్ యు వసేన నాయకులు మస్తానయ్య,రియాజ్, ఫయాజ్, బండి రమణారెడ్డి, తూపుల వెంకటరమణారెడ్డి, సుధా కర్‌రెడ్డి, రాఘవ, అంకయ్య, హరినాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మొయిళ్ళ దంపతులు ఆదర్శనీయులు

**నెల్లూరురూరల్, సెప్టెంబరు14 ప్రభాతవార్త** నిరంతరం ప్రజాసేవలో గడిపే 21వడివిజన్ వైకాపా ఇన్‌చార్జ్ మొ యిళ్ళ సురేష్‌రెడ్డి – గౌరి దంపతులు ఆదర్శనీయులని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధ వారం నగరంలోని వనంతోపు సెంటర్లో నిర్వహించిన వైకాపా మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, కార్పో రేటర్ మొయిళ్ళగౌరి పుట్టినరోజు వేడుకలకు ఎమ్మెల్యే కోటంరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకు సాగాలని సూచించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. గౌరీని పలువురు అభినందించారు. అన్నదానం చేశారు.



# 21వడివిజన్ అభివృద్ధికి ప్రణాళిక



**నెల్లూరురూరల్, సెప్టెంబరు14 ప్రభాతవార్త** రూరల్ పరిధిలోని 21వవ డివిజన్ స్థానిక ఉమ్మారెడ్డిగుంట అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలి పారు. బుధవారం 21వడివిజన్ స్థానిక ఉ మ్మారెడ్డిగుంటలో రూ.1.85కోట్ల అంచ నాలతో నిర్మించనున్న రహదారుల పను లను ఆయన ప్రారంభించారు. ఈసం దర్భంగా మాట్లాడుతూ, జనావాసాలతో శరవేగంగా రూరల్ నియోజకవర్గం విస్తరిస్తోందన్నారు. విస్తరిస్తోన్న శివారు ప్రాంతాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానన్నారు. స్థానిక ప్రజాభీష్టం మేరకు ఎక్కడికక్కడ అభివృద్ధి పనులను చేపట్టి పూర్తిచేస్తున్నామని వివరించారు. రూరల్లో రహదారుల నిర్మాణానికి విరివిగా నిధులు మంజూరుచేసిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. తద్వారా ప్రధాన రహదారులను దాదాపుగా పూర్తిచేశా మన్నారు. శివారు ప్రాంతాల ప్రజలకు తాగునీరు, రహదారులు, డ్రెయిన్లు, విద్యుత్ తదితర మౌళిక సదుపాయాలు కల్పించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. స్థానిక డివిజన్ ఇన్‌చార్జ మొయిళ్ళ సురేష్‌రెడ్డి అధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో కార్పొరేటర్‌లు మొయిళ్ళ గౌరీ, చేజర్ల మహేష్‌బాబు, దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డి తదితర అధికారులు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







## భూసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



**మర్రిపాడు, సెప్టెంబర్14, ప్రభాతవార్త:** భూసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నానని ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నెల్లూరులోని క్యాంప్ కార్యాలయంలో మర్రిపాడుకు చెందిన బిసికాలనీవాసులు కలిశారు. ఈసందర్భంగా వారు తమకు దశాబ్దాల క్రితం ప్రభుత్వం అందజేసిన సిజెఎఫ్ఎస్ పట్టాలకు పాస్‌పుస్తకాలు మంజూరు చేయించేలా చూడాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో జరిగే అసైన్‌మెంట్ కమిటీలో అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ ఫలాలు అందుతున్నాయా లేదా అని ఆరాతీశారు. సచివాలయాల్లో ని వాలంటీర్ల పనితీరు ఎలా ఉందంటూ ప్రశ్నించారు. నెల్లూరుపార్లమెంట్ మాజీ సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి కృషి వలనహైలెవల్ కాలువ మంజూరైందని , అభివృద్ధిలోకి వస్తే మెట్ట ప్రాంతమైన మ ర్రిపాడుకు డెల్టాను తలపిస్తుందనా న్నరు. బిసికాలనీవాసులకు జలజీవన్‌మిషన్ ద్వా రా తాగునీటి సమస్యను పరిష్కరించడం వలనాత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## అత్యధికంగా మాట్లడే బాష హిందీ



**వెంకటాచలం సెప్టెంబర్ 14 ప్రభాతవార్త** ప్రపంచములో మాట్లడే బాషలో హిందీ బాష స్దానం చాల గోప్పదని యూత్ ఆఫిసర్ ఏ మహేంద్రరెడ్డి తెలిపారు. వెంకటాచలంలోని ప్రభుత్వజూనియర్ కళశాల నందు హిందీ దివస్ కార్యక్రము నిర్వహించారు. ఈకార్యమ్రానికి మహేంద్రరెడ్డి పాల్గోన్నా రు. అయన మాట్లడుతూ హిందీని దేవనాగరిలో లిపిలో రాస్తాముని, ప్రపంచ బాషల్లో అత్యదికంగా హిందీ రెండువ స్దానంలో ఉందిన్నారు. హిందీదవస్ ఏటా 14సెప్టెంబర్ దేశంగా ఘనంగా .జరుపు కుంటామన్నారు. బారత అదికారిక బాషగా హిందీని గుర్తించడంతో ఎన్నలేని కృషి చేసిన బియోహార్ రాజేంద్ర సింహ పుట్టిన రోజు సెప్టెంబర్ 14 కావడం విశేషం అన్నారు. ఈకార్యక్రములో ప్రిన్సి పాల్ దీన్‌దయాల్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఉదయశంకర్, రూడ్స్ చారిటుబుల్ ట్రస్ట్ చెర్మన్ షేక్ రసూల్ కళశాల శిబ్బది పాల్గోన్నారు

**ఘనంగా హిందీ దివస్** మండల పరిదిలోని సర్వేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాద్యాయులు విజయ, హిందీ టిచర్ ఖాదర్ ఆద్వర్యంలో సరస్వతి దేవి విగ్రహానికి, గాందీజీ, రాదాకృష్టన్, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా హిందీ దివస్ నిర్వహించారు. హిందీ భాష గోప్పతానిని విద్యార్దులకు హిందీ ఉపాద్యాయరాలు క్లుప్తంగా వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## రాజశేఖర్‌రెడ్డిపాలన కన్న.. జగన్మోహన్‌రెడ్డి పాలనమిన్న



కలిగిరి, శెప్టెంబర్14, ప్రభాతవార్త; దివంగ తనేత వైయస్‌రాజశేఖర్‌రెడ్డి పాలన ప్రజారంజకంగా పాలన సాగిం చారు. అయితే ఆయనకు పుట్టిన బిడ్డగా వైయఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన తండ్రికన్నా మిన్నగా సాగిస్తూ నేడు ప్రజలనుండి జేజేలు అందుకుంటున్నారని తండ్రికి మిచి పాలన సాగిస్తూ ప్రజల హృదయా ల్లోచి రస్తాయిగా నిలిచి పోతున్నారని ఉదయగిరి శాసన సబ్యులు మేకపాటి చంద్రశేఖర్రడ్డి తెలిపారు. గడపగ డపకూ మన ప్రభుత్వంకార్యక్రమంలో బాగంగా బుధవారం కలిగిరియమండలంలోని పెద్దకొండూరు, అయ్య పరెడ్డిపాళెంగ్రామాలలో అధికారులు, వైసిపి శ్రేణులతో కలిసి మేకపాటి పర్యటించారు. ఈ సందర్బంగా ప్రజ లు మేకపాటికి మంగళహారతులతో స్వాగతం పలికారు. గడపగడపకూ తిరుగుతూ ప్రభుత్వం అందజేస్తున్న పథకాలగురించి వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈక్రమంలో కొన్ని కాలనీల్లో తిష్టవేసకున్నకున్న సమ స్యల్ని కాలనీ వాసులు యంఎల్ఏ దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలంటూ అధికారులను ఆదేశిం చారు. అనంతరం వైసిపి శ్రేణులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యంఎల్ఏ మాట్లాడుతూ ప్రజలు జగన్ ప్రభుత్వంపై పూర్తి విస్వాసంతోఉన్నారన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలనుండి వస్తున్న స్పందనే దీనికి నిదర్శనమన్నారు. నాడు స్వర్గీయ రాజశేఖర్‌రడ్డిపాలన ప్రజలమన్ననలు పొందితే నేడు జగన్‌పాలన తండ్రికి తగ్గ తనయుడిగా పేరుతెచుకున్నారన్నారు. ఇలాంటి ముక్యమంత్రిని 2024లో మరలా ప్రజలు తప్పక ఎన్నుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరా జ్యం ఒక్కజగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమ వుతుందన్నారు. ప్రజలవద్దకే సంక్షేమ ఫథకాలు తీసుకువచ్చేందుకు దేశంలోనే ప్రప్రథమంగా గ్రామ సచివాలయ వ్యవస్తను తీసుకువచ్చిన ఘనత ఒక్క జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో అనీ సక్రమంగా జరుగుతున్నాయన్నారు. 24లో సియంగా జగన్‌ని యంఎల్ఏగా తనను గెలిపించాలని ప్రజలను కోరారు ఉదయగిరి వైసిపి ప్రచార కార్యదర్శి శాంతకు మారి కలిగిరి మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు, మండల స్తాయి అధికారులు పాల్గొన్నారు.

## శాఖపరమైన నివేదికలతో సిద్ధంగా ఉన్నండి



వింజమూరు, సెప్టెంబర్14, ప్రభాతవార్త: ఈనెల 24నుండి ఊటుకూరు గ్రామా నికి ఐఎస్ అధికారుల బృందం రాను న్నారని మండల స్థాయి అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన సమగ్ర నివేదికలతో సిద్ధంగా ఉండాలని కావలి ఆర్‌డిఓ శీనానాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఊటుకూరు పంచాయతీలో మండలస్థాయి అధికారులతో కావలి ఆర్‌డిఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 8మంది ఐఎస్ అధికారుల బృందం 24నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు ఊటుకూరు పంచాయతీలో పర్యటించి ఫీల్డ్ సర్వే , రీసెర్చ్ చేస్తారన్నారు. గ్రామానికి సంబంధించిన అన్ని శాఖల పనుల అమలు తీరుతెన్నుల అధ్ యయనంతోపాటు పరిశోధనలు చేసి సమగ్ర నివేదికలను సిద్ధం చేస్తారన్నారు. ఈనేపథ్యంలో వారికి తగు ఏర్పాట్లు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో తహసిల్దార్ చొప్పా రవీంద్రబాబు, సర్పంచ్ రొడ్డా వెంగమ్మ, ఎంపిటిసి సభ్యులు మల్లిఖార్జున, ఎంపిడిఓ స్వరూపరాణి, ఎంఇఓ మాలకొండలరావ్, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా న్యాయం కోసం ప్రతిపక్షం అవసరం



**నెల్లూరు సెప్టెంబర్ 14, ప్రభాతవార్త–వైద్యం** రాష్ట్రంలో హత్యలు, మానభంగాలు, దాడులు, అరాచకాలు పెరిగిపోయాయని వాటిని నియంత్రించాలంటే ప్రజల పక్షాన గళం విప్పడానికి ప్రతిపక్షం అందులో భాగంగా జరగనున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో విద్యావంతుడైన కంచర్ల శ్రీకాంత్‌ను భారీ మెజారిటీతో గెలిపించి శాసనమండలికి పంపించాల్సిన అవసరం మనకు ఏంతైనా ఉందని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అబ్దుల్‌అజీజ్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు కోటంరెడ్డి.శ్రీనివాసులురెడ్డి, అబ్దుల్‌అజీజ్‌లు క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. అనంతరం తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల.శ్రీకాంత్‌చౌదరితో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 మార్చిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రాబోతున్నాయని అందులో తూర్పు రాయలసీమ అభ్యర్థిగా టీడీపీ నుంచి శ్రీకాంత్‌ను పోటీకి నిలబెడుతున్నట్లు ఆయన వెల్లడించారు. జరగబోయేవి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలని ఎవరైతే అక్టోబర్ 1 తారీఖు 2019కి డిగ్రీ పూర్తి చేసి ఉంటారో వారు ఓటు వేయడానికి అర్హులని పేర్కొన్నారు. సాధారణ ఎన్నికల ఓటర్ లిస్టుకి ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ లిస్టుకి చాలా తేడా ఉందని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రత్యేకంగా ఓటు నమోదు చేసుకోవాలని వారు సూచించారు. అక్టోబర్ 1 నుంచి నవంబర్ 7 వరకు పట్టభద్రుల ఓటర్ నమోదు కార్యక్రమం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎవరైనా నమోదు చేసుకోవాలనుకున్నవారు ధరఖాస్తు ఫారమ్ కోసం టీడీపీ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునే పరిస్థితి ప్రస్తుత పాలక నాయకులకు లేదని ప్రతిపక్షం అనేది లేకపోతే రాష్ట్రం అధోగతి పాలవుతుందని వివరించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు లేకుండా పోయాయని ఆరోపించారు. వైసీపీ నాయకులు న్యాయం ధర్మం పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పంచభూతాలను దోచుకుంటున్నారని మండిపడ్డారు. ప్రజల పక్షాన మాట్లాడడానికి ప్రతిపక్షం అవసరమని వారు ఉద్ఘాటించారు. శ్రీకాంత్ విద్యావంతుడని గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సంస్థలు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రజలకు విద్యను అందచేస్తున్న మంచి మనిషి అని కొనియాడారు. అలాంటి వ్యక్తిని ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించి శాసనమండలికి పంపించాలని కోరారు. టీచర్లను ఈ ప్రభుత్వం దొంగల్ని చూసినట్లు చూసిందని నేరస్థులగా చిత్రీకరించిందని వాటన్నింటికీ సమాధానం చెప్పాలంటే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జెన్ని.రమణయ్య, ముప్పాళ్ళ.విజేతరెడ్డి, సాబీర్‌ఖాన్, కాకర్ల.తిరుమలనాయుడు, రాజానాయుడు, జలదంకి.సుధాకర్, మాతంగి.కృష్ణ, పిట్టి.సత్యనాగేశ్వరరావు, కె.సాయిబాబా, నారా.శ్రీనివాసులు, కువ్వారపు.బాలాజీ, తానే.మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలనే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం



**నెల్లూరురూరల్, సెప్టెంబరు14 ప్రభాతవార్త** పేదరిక నిర్మూలనే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. రూరల్ పరిధిలో రెండవ విడత గడపగడపకూ – మనప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం 33వడివిజన్ నేతాజీనగర్ నుండి నిర వ్వహించారు. ప్రజలు వివిధ సమస్యలను ఎమ్మెల్యే కోటంరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరుపేద ప్రజా సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. బడుగు బలహీన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా రాష్ట్రంలో కొనసాగుతోన్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహనరెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మహిళల అండ ముఖ్యమంత్రికి పుష్కలంగా ఉందన్నారు. బలహీన వర్గాలను మంత్రులు, ఉప ముఖ్యమంత్రులుగా చేసిన ఘనత వైకాపా ప్రభుత్వానికే దక్కుతోందన్నారు. స్థానిక సమస్యల పరిష్కారమే ధ్యేయమన్నారు. రూరల్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని హామి ఇచ్చారు. స్థానిక డివిజన్ ఇన్‌చార్జ్ కరణం హజరత్‌నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో కార్పొరేటర్ మంజుల తదితర అధికారులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెడికవర్‌లో అత్యాధునిక కాన్సర్ వైద్యసేవలు



**నెల్లూరురూరల్, సెప్టెంబరు14 ప్రభాతవార్త** నగరంలోని మెడికవర్ హాస్పిటల్‌లో అత్యాధునిక కాన్సర్ వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని వైస్ ప్రెసిడెంట్ మహేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం హాస్పటల్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కాన్సర్ నివారణ సదస్సులో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం కాన్సర్ వైద్యసేవలు విస్తరించాయన్నారు. గత యేడాదిన్నర కాలంలో వెయ్యి డిజిటల్ పెట్ స్కాన్‌లు చేసిన ఘనత తమ యూనిట్‌కే దక్కుతోందన్నారు. రేడియేషన్ తక్కువగా ఉండే ఈస్కాన్‌లో వ్యాధి లక్షణాలు, తీవ్రతను ఖచ్చితత్వంతో గుర్తించవచ్చన్నారు. తమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సెంటర్‌హెడ్ డాక్టర్ గణేష్ నాగిరెడ్డి మాట్లాడుతూ, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తమ యూనిట్‌లో మాత్రమే ఈస్కాన్ అందుబాటులో ఉందన్నారు. అత్యధిక సంఖ్యలో రోగులు తాము అందిస్తోన్న చికిత్సలతో వ్యాధిని పూర్తిస్థాయిలో జయించి సాధారణ జీవితాన్ని గడపడం గర్వకారణమన్నారు. పూర్తిస్థాయిలో కోలుకుని సాధారణ స్థితికి చేరుకున్న వారితో ముఖాముఖి నిర్వహించారు. కేక్ కట్ చేసి వైద్యబృందాన్ని అభినందించారు. ఈకార్యక్రమంలో సంబంధిత వైద్య నిపుణులు ముత్తు, రంగరామన్, శ్రీవిద్య, అవినాష్, శ్రేయాస్, ప్రియ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.